PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

సిటీ

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 335 | విజయవాడ, సోమవారం 8 జులై 2024 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Monday 8 July 2024 | Rs



పుంగనూరులో ఇండోర్ స్టేడియం నేలమట్టం

- ప్రతీకార చర్యలా? అక్రమ కట్టడాలని కూల్చేశారా?

3



అభిషేక్ అదరహో

46 బంతుల్లోనే సెంచరీ చేసిన చిచ్చరపిడుగు

స్పిన్, పేస్‌కు జింబాబ్వే విలవిల

100 పరుగుల తేడాతో భారత్ విజయం

6

'అల్ట్రాటెక్'లో ఘోరం

- సిమెంట్ ఫ్యాక్టరీ బాయిలర్ పేలి ఇద్దరు కార్మికులు మృతి
- మరో 14 మందికి గాయాలు
- వారిలో ఐదుగురి పరిస్థితి విషమం
- బాధితులకు అండగా నిలవాలని సిఎం ఆదేశం

ప్రజాశక్తి- యంత్రాంగం

ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం బోదవాడలోని ఆదిత్య బిర్లా గ్రూపునకు చెందిన అల్ట్రాటెక్ బాలాజీ సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా దారుణం చోటుచేసుకుంది. బాయిలర్ పేలి అధిక ఉష్ణోగ్రతతో కూడిన మెటీరియల్ మీదపడడంతో ఇద్దరు కార్మికులు మృతి చెందారు. మరో 14 మంది తీవ్రంగా గాయపడ్డారు. బాధితులకు అండగా నిలవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధికారులను ఆదేశించారు. ఆదివారం ఉదయం పది గంటల సమయంలో చోటుచేసుకున్న ఈ ప్రమాద ఘటనకు సంబంధించి తోటి కార్మికుల కథనం ప్రకారం... ప్రీ హీటర్ నిర్వహణలో లోపం కారణంగా బాయిలర్ పేలింది. దీనిద్వారా 1,300 డిగ్రీల ఉష్ణోగ్రతతో క్లింకర్, కిలన్ సరఫరా అవుతుంది. ఈ బాయిలర్‌కు సమీపంలో పనిచేస్తున్న కార్మికులపై ఈ మెటీరియల్ పడింది. దీంతో, 16 మంది తీవ్రంగా గాయపడ్డారు. వారిని విజయవాడలోని ఆంధ్రా, మణిపాల్ ఆస్పత్రులకు తరలించారు. బూదవాడ గ్రామానికి చెందిన ఆవుల వెంకటేష్ (37), పరిటాల అర్జునరావు (38) మణిపాల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందారు. మరో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉంది.

క్షతగాత్రుల్లో బూదవాడ గ్రామానికి చెందిన బాణావత్ స్వామి, వేముల సైదులు, గుగులోతు గోపి నయక్, గుగులోతూ బాలాజీ, ధారావత్ వెంకటేశ్వర్లు, బాణావతి సైదా, బీహార్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన వివేక్ సింగ్, నాగేంద్ర సూరజ్ సింగ్, శుభ్రం సోని, గుడ్డు కుమార్, దినేష్ కేశ్‌లాష్, రవికుమార్ విశ్వకర్మ, అరవింద్ యాదవ్ ఉన్నారు. క్షతగాత్రుల్లో ఏడుగురు విజయవాడ ఆంధ్రా ఆస్పత్రిలోనూ, మరో ఏడుగురు మణిపాల్ ఆస్పత్రిలోనూ చికిత్స పొందుతున్నారు.



గాయపడిన కార్మికుడు

రూ.50 లక్షల చొప్పున నష్టపరిహారం : సిపిఎం డిమాండ్

ఈ ప్రమాదం పట్ల సిపిఎం రాష్ట్ర కమిటీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. మృతి చెందిన వారి కుటుంబాలకు ప్రభుత్వం రూ.50 లక్షల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. గాయపడిన వారికి ప్రభుత్వమే మెరుగైన వైద్యం అందించాలని, గాయపడిన తీవ్రతను బట్టి నష్టపరిహారాన్ని అందించాలని, ఈ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం విచారణ జరిపి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గాయపడిన వారిని సిపిఎం బృందం ఆస్పత్రికెళ్లి పరామర్శించింది.



మృతిచెందిన అర్జునరావు (ఫైల్)

యాజమాన్య నిర్లక్ష్యమే కారణం

ఫ్యాక్టరీలో సిమెంట్ తయారు చేసే క్రమంలో లైమ్ స్టోన్, ఐరన్ ఓర్, రెడ్ సాయిడ్ మిశ్రమాన్ని అత్యంత ఉష్ణోగ్రతతో పైప్ ద్వారా సరఫరా చేస్తారు. రెండు నెలలుగా పైప్‌లైన్ లీకు అవుతోందని, రక్షణ చర్యలు తీసుకోవాలని కార్మికులు యూనిట్ హెడ్ శివరావు దృష్టికి అనేక పర్యాయాలు తీసుకెళ్లారు. అయినా, పైప్‌లైన్ మార్చకుండా యాజమాన్యం నిర్లక్ష్యం వహించడం వల్ల ప్రమాదానికి దారితీసిందని కార్మికులు అంటున్నారు. గతంలోనూ ఈ ఫ్యాక్టరీలో ప్రమాదాలు జరిగాయని, వాటిని బయటకు రానీయకుండా యాజమాన్యం కప్పిపెట్టిందని వారు చెబుతున్నారు.

సిఎం ఆరా

ప్రమాద ఘటనపై సిఎం చంద్రబాబు ఆరా తీశారు. ప్రమాదం లో గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని అధి కారులను ఆదే శించారు. క్షత గాత్రులకు అందు తున్న వైద్యంపై సిఎంఒ అధి కారులతో మాట్లాడి తెలుసుకున్నారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఘటనకు కారణాలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బాధిత కుటుంబాలకు కంపెనీ నుంచి పరిహారం అందేలా చూడడంతోపాటు ప్రభుత్వం నుంచి కూడా సహాయం అందిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు.

ఫ్యాక్టరీ వద్ద పోలీస్ బందోబస్తు

యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా తమ వారు ప్రమాదానికి గురయ్యారని తెలవడంతో మిగతా 2లో

గాజాలోని ఐరాస స్కూల్‌పై ఇజ్రాయిల్ దాడి

- 16 మంది మృతి

గాజా : తొమ్మిది నెలలు దాటుతున్నా.. గాజాపై ఇజ్రాయిల్ మారణహోమం ఆగడం లేదు. శనివారం గాజాలోని పలు ప్రాంతాలపై ఇజ్రాయిల్ కిరాతకంగా విరుచుకుపడింది. ఐక్యరాజ్య సమితి నిర్వహించే పాఠశాలపై ఇజ్రాయిల్ చేసిన దాడుల్లో 16 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 50 మంది తీవ్రంగా గాయపడ్డారు. మరణించిన, గాయపడిన వారిలో అత్యధికులు చిన్నారులే. మధ్య గాజాలోని న్యూసెరాత్ ప్రాంతాలో ఉన్న అల్-జావ్ని పాఠశాలలో వేలాది మంది నిరాశ్రయులు తలదాచుకుంటున్నారు. సాయుధులు ఈ పాఠశాలలో దాక్కొన్నారనే పేరుతో ఇజ్రాయిల్ వైమానిక దాడులు జరిపింది. హమాస్ అధికారుల సమాచారం ప్రకారం దాడుల సమయంలో ఈ పాఠశాలలో సుమారు ఏడు వేల మంది ప్రజలు తలదాచుకున్నారు. మృతుల్లో ఎక్కువ మంది చిన్నారులు, మహిళలు, వృద్ధులు. 'పాలస్తీనా ప్రజలపై మారణహోమంలో భాగంగా శత్రువు చేసిన కొత్త ఊచకోత' అని హమాస్ అధికారులు ఈ దాడిని ఖండించారు. ఐరాసకు చెందిన యుఎన్‌ఆర్‌డబ్ల్యుఎ ద్వారా పాలస్తీనా శరణార్థుల కోసం ఈ పాఠశాల నడుస్తోందని హమాస్ అధికారిక పత్రికా కార్యాలయం తెలిపింది. మధ్యవర్తుల చొరవతో కాల్పుల విరమణపై చర్చలకు అంగీకరించిన ఇజ్రాయిల్ మరోవైపు దాడులు కొనసాగిస్తూనే ఉంది. శనివారం మధ్య గాజాలోనే ఉన్న తమ గోదాముపై ఇజ్రాయిల్ దాడిలో ఇద్దరు కార్మికులు మరణించినట్లు యుఎన్‌ఆర్‌డబ్ల్యుఎ తెలిపింది. ఈ ప్రాంతం నుంచి మరో తొమ్మిది మృతదేహాలు తమ ఆసుపత్రికి వచ్చినట్లు అల్-అక్సా ఆసుపత్రి ప్రకటించింది. ఇజ్రాయిల్ దాడులు ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకూ 194 మంది కార్మికులు మరణించినట్లు యుఎన్‌ఆర్‌డబ్ల్యుఎ తెలిపింది. శనివారం నుసిరత్‌లోని ఒక భవనంపై దాడిలో ముగ్గురు జర్నలిస్టులతో సహా 10 మంది మరణించారని వైద్య సిబ్బంది తెలిపారు.



ర్యాలీలో కార్యకర్తలకు అభివాదం చేస్తున్న చంద్రబాబు

తెలుగు రాష్ట్రాలు నాకు రెండు కళ్లు

- అభివృద్ధి కోసం కలిసి పనిచేస్తాం : సిఎం చంద్రబాబు
- జూబ్లిహిల్స్ నివాసం నుంచి ఎన్‌టిఆర్ భవన్ వరకు భారీ ర్యాలీ

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

ఎపి, తెలంగాణ తనకు రెండు కళ్లని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. తెలుగు జాతి అభివృద్ధే ధ్యేయంగా తెలంగాణ ప్రభుత్వంతో కలిసి పనిచేస్తానన్నారు. ఎపిలో కూటమి విజయానికి తెలంగాణ టిడిపి శ్రేణులు పరోక్షంగా కృషి చేశాయని పేర్కొన్నారు. తెలంగాణ గడ్డపైనే టిడిపి ఆవిర్భవించిందని, తెలంగాణలో పార్టీ పునర్ వైభవం వస్తుందని అన్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారిగా హైదరాబాద్‌లోని ఎన్‌టిఆర్ ట్రస్ట్ భవన్‌కు ఆదివారం వచ్చిన చంద్రబాబుకు టిడిపి నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కార్యకర్తలనుద్దేశించి ఆయన మాట్లాడుతూ 'కష్టకాలంలో నాకూ, పార్టీకీ మద్దతుగా నిలిచిన ఆత్మీయులకు అభినందనలు తెలియజేయడానికి వచ్చాను. మీ అభిమానం చూస్తుంటే నాకు ఉత్సాహం వస్తోంది. తెలంగాణలో అధికారంలో లేకున్నా కార్యకర్తలు పార్టీని వదల్లేదు. పార్టీ నుంచి నాయకులు తప్ప, కార్యకర్తలు వెళ్లలేదు. తెలంగాణ గడ్డపైనే టిడిపిని ఎన్‌టిఆర్ స్థాపించారు. అనేక పరిపాలనా సంస్కరణలు తీసుకొచ్చి సంక్షేమానికి నాంది పలికారు. తెలుగుజాతి ఉన్నంతవరకు టిడిపి జెండా రెపరెపలాడుతుంది. సంక్షోభాన్ని అవకాశంగా మలచుకుని ఎపిలో మళ్లీ అధికారంలోకి వచ్చాం. నన్ను జైల్లో పెట్టినప్పుడు టిడిపి శ్రేణులు చూపించిన చొరవ మరువలేను. ఆ సమయంలో గచ్చిబౌలిలో నిర్వహించిన సభను నేను మరిచిపోలేను' అని అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో తాను సిఎంగా ఉన్నప్పుడు చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన మిగతా 2లో

రెండు రాష్ట్రాలు సామరస్యంగా పరిష్కరించుకోవాలి

- సిపిఎం రాష్ట్ర కమిటీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర విభజన అనంతరం పదేళ్లుగా అపరిష్కృతంగా మిగిలిపోయిన ఉభయ రాష్ట్రాల సమస్యలపై రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ద్వైపాక్షిక చర్చలు జరపడం అభినందనీయమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు పేర్కొన్నారు. రెండు రాష్ట్రాల్లో ఎలాంటి అపోహలకు అవకాశం లేకుండా చర్చలు పారదర్శకంగా నిర్వహించాలని కోరారు. అలాగే రాష్ట్రానికి ప్రత్యేక హోదాతోపాటు అన్ని విభజన హామీల అమలుపై అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ మేరకు సిపిఎం రాష్ట్ర కమిటీ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఉభయ రాష్ట్రాలను అభివృద్ధి చేయడంలో విభజన హామీలను నెరవేర్చడంలో కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇస్తామన్న కేంద్రం మాట తప్పిందన్నారు. కనీసం రెండు రాష్ట్రాల మధ్య విభజన చట్టంలో వున్న 9, 10 షెడ్యూల్ అంశాలను కూడా పరిష్కరించకుండా నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చొరవ తీసుకుని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో సమావేశం కావడం హర్షణీయమన్నారు. పెండింగ్‌లో వున్న సమస్యలను చర్చించి పరిష్కరించుకోవటానికి అధికారుల స్థాయిలో కమిటీ వేయడాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు. రెండు రాష్ట్రాల సమస్యలను కేంద్రం చేతిలో పెట్టకుండా పరస్పర అవగాహనతో ఉభయులూ కూర్చొని చర్చించుకునే ప్రక్రియను కొనసాగించాలని సిపిఎం కోరుకుంటోందని తెలిపారు.

ప్రత్యేక హోదాను వదులుకోవడం రాష్ట్రానికి నష్టం

సిఎం చంద్రబాబు ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీని, ఇతర మంత్రులను కలిసిన అనంతరం హిందూ దినపత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో రాష్ట్రానికి ప్రత్యేక హోదా సమస్యకు అంత ప్రాధాన్యత లేదని చెప్పటాన్ని వి శ్రీనివాసరావు తీవ్రంగా ఖండించారు. రాష్ట్ర ఆర్థిక సమస్యలను ప్రత్యేక హోదాతో ముడిపెట్టడం ఆక్షేపణీయమని అన్నారు. ప్రత్యేక హోదా ఆంధ్ర ప్రజల హక్కు అని, ఇది రాష్ట్రాభివృద్ధితో ముడిపడిన అంశమని అన్నారు. రాష్ట్రప్రభుత్వ ఖజానాకు కేంద్రం నుంచి నిధులు సాధించటం ప్రత్యేక హోదాతో సంబంధం లేని విషయంగా రాష్ట్ర ప్రభుత్వం చూడాలన్నారు. రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న విధంగా బకాయిలను చెల్లించాల్సిన బాధ్యత కేంద్రంపై వుందని అన్నారు. ఇప్పటికైనా విభజన హామీలు, ఆర్థిక మద్దతుతోపాటు ప్రత్యేక హోదా కోసం రాష్ట్ర ప్రభుత్వం గట్టిగా కృషి చేయాలని డిమాండ్ చేశారు.

కుల్గాంలో జంట ఎన్‌కౌంటర్లు

- ఇద్దరు భద్రతా సిబ్బంది, ఆరుగురు ఉగ్రవాదులు మృతి

జమ్ము : జమ్ముకాశ్మీర్‌లోని కుల్గాం జిల్లాలో ఆదివారం జరిగిన రెండు వేర్వేరు ఎన్‌కౌంటర్లలో ఇద్దరు భద్రతా సిబ్బంది, ఆరుగురు ఉగ్రవాదులు మరణించారు. రాజౌరిలో జరిగిన ఉగ్రదాడిలో ఒక జవాన్ తీవ్రంగా గాయపడ్డారు. కుల్గాంలోని చినిగాం, మోటర్‌గామ్ ప్రాంతాల్లో ఉగ్రవాదులు ఉన్నారనే సమాచారం అందడంతో శనివారం నుంచి పోలీసులు, సైన్యం సంయుక్తంగా గాలింపు చర్యలు చేపట్టాయని జమ్ముకాశ్మీర్ డిజిపి ఆర్‌ఆర్ స్వైన్ తెలిపారు. తనిఖీలు చేస్తున్న భద్రతా సిబ్బందిపై ఉగ్రవాదులు ఒక్కసారిగా కాల్పులు జరపడంతో సిబ్బంది కూడా ఎదురు కాల్పులు జరిపారని చెప్పారు. చినిగాం, మోటర్‌గామ్‌లో ఎన్‌కౌంటర్లలో చనిపోయిన జవాన్లను లాన్స్ నాయక్ పర్దీప్ కుమార్, సిపాయి ప్రవీణ్ జంజల్ ప్రభాకర్‌గా గుర్తించారు. రాజౌరిలోని ఆర్మీ పోస్ట్‌పై ఆదివారం ఉగ్రవాదులు జరిపిన దాడిలో ఒక సైనికుడు తీవ్రంగా గాయపడ్డారు. మంజాకోట్ ప్రాంతంలోని గలుతిలో ఉన్న ఆర్మీ క్యాంప్‌పై ఆదివారం తెల్లవారు జామున 4 గంటల ప్రాంతంలో ఈ దాడి జరిగిందని అధికారులు తెలిపారు.

వాట్సాప్‌కు స్పందించిన లోకేష్

- వికలాంగ విద్యార్థుల సమస్య పరిష్కారం
- ఐఐటిల్లో 25 మందికి ప్రవేశాలు



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తన దృష్టికి వచ్చిన సమస్యపై విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వేగంగా స్పందించారు. దీంతో 25 మంది విద్యార్థులు ఐఐటి, ఎన్ఐటి వంటి ఉన్నత విద్యాసంస్థల్లో ప్రవేశం పొందగలిగారు. విజయవాడకు చెందిన వికలాంగ విద్యార్థి మారుతీ పృథ్వీ సత్యదేవ్‌తోపాటు 25 మంది జెఇఇ అడ్వాన్స్‌డ్ పరీక్షలు రాశారు. వీరంతా డాక్యుమెంట్ వెరిఫికేషన్ ప్రక్రియలో భాగంగా ఇంటర్ మెమో అప్‌లోడ్ చేయాల్సి ఉంది. ఇంటర్ బోర్డు నిబంధనల ప్రకారం వికలాంగులకు లాంగ్వేజ్ సబ్జెక్టులు రెండింటిలో ఒకదానికి మినహాయింపు ఉంది. మినహాయింపు పొందిన లాంగ్వేజ్ సబ్జెక్టుతో కలిసి మార్కుల మెమోలో ఐదు సబ్జెక్టు మార్కులుంటాయి. మినహాయింపు సబ్జెక్టుకు సంబంధించి సర్టిఫికెట్‌లో ఇంటర్ బోర్డు 'ఈ' (ఎగ్జమ్షన్) అని మాత్రమే జారీ చేస్తోంది. ఐఐటి మద్రాస్ డాక్యుమెంట్ వెరిఫికేషన్ విభాగం వారు మెమోలో కేవలం 4 సబ్జెక్టులు మాత్రమే ఉన్నాయని అభ్యంతరం తెలిపారు. మ్యాథ్స్ ఎ, బిలను ఒకే సబ్జెక్టుగా పరిగణిస్తున్నామని, అందువల్ల ఈ సర్టిఫికేషన్‌ను అంగీకరించబోమని విద్యార్థులకు సమాచారం ఇచ్చారు. సెకెండ్ లాంగ్వేజ్ సబ్జెక్టుకు సంబంధించిన సర్టిఫికెట్‌లో 'ఈ' స్థానంలో నిర్దిష్ట సంఖ్యా విలువను కలిగి ఉంటేనే ప్రవేశానికి అవకాశం కల్పిస్తామని తెలిపారు. ఈ పరిస్థితిపై లోకేష్‌కు జూన్ 22వ తేదీన వాట్సాప్ ద్వారా సత్యదేవ్ సందేశం పంపారు. స్పందించిన లోకేష్.. సత్యదేవ్‌తోపాటు అతని కుటుంబ సభ్యులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. మినహాయింపు పొందిన సెకెండ్ లాంగ్వేజ్‌లో 'ఈ' కి బదులుగా మార్కులతో ఇంటర్ సర్టిఫికెట్ ఇవ్వాలని బోర్డు అధికారులను లోకేష్ ఆదేశించారు. అధికారులు 'ఈ'ని కనిష్టంగా 35 మార్కులుగా పేర్కొంటూ తదనుగుణంగా మార్కులతో కూడిన మెమో జారీ చేశారు. ఈ సర్టిఫికెట్ తీసుకెళ్లినా దీనిని అంగీకరించబోమని, ఎపి ప్రభుత్వం నుంచి జిఒ కావాలని కౌన్సెలింగ్ అధికారులు చెప్పారు. ఇదే విషయాన్ని సత్యదేవ్ మళ్లీ మంత్రి కార్యాలయం అధికారులకు ఫోన్ ద్వారా వివరించారు. విషయం తెలుసుకున్న లోకేష్ వెంటనే జిఒ విడుదల చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ జిఒ వల్ల రాష్ట్ర వ్యాప్తంగా 25 మంది విద్యార్థులకు ఐఐటి, ఎన్ఐటి, ట్రిపుల్ ఐటి వంటి ప్రముఖ విద్యాసంస్థల్లో సీట్లు లభించాయి.

జులై ఫోర్త్ వేడుకలపై కాల్పులు

- అమెరికా వ్యాప్తంగా ఐదుగురి మృతి

వాషింగ్టన్ : అమెరికాలో తుపాకీ సంస్కృతి మరోసారి విజృంభించింది. వివిధ నగరాల్లో జులై ఫోర్త్ హాలీడే వేడుకలపై జరిగిన కాల్పుల్లో ఐదుగురు మరణించారు. చికాగోలో ఒక ఇంటిపై జరిపిన కాల్పుల్లో ఇద్దరు మహిళలు మరణించారు. మరో ముగ్గురు బాలలు కూడా గాయపడ్డారు. రెండు వాహనాల్లో వచ్చిన సాయుధులు ఈ కాల్పులకు పాల్పడ్డారు. ఇక క్లీవ్‌ల్యాండ్‌లో జరిగిన కాల్పుల్లో జామీసన్ రిట్టర్ అనే పోలీసు అధికారి మృతి చెందారు. ఫిలడెల్ఫియా కాల్పుల ఘటనలో 19 ఏళ్ల యువకుడు మృతి చెందాడు. మరో ఏడుగురు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. సియాటిల్ శివారులోని ఒక మాల్‌లో జరిగిన కాల్పుల్లో 13 ఏళ్ల బాలిక మరణించింది. రెండు గ్రూపుల మధ్య జరిగిన కాల్పుల్లో ఏ సంబంధం లేని బాలిక మరణించడం ఆందోళన కలిగించింది. గత ఏడాది ఇదే సందర్భంగా జరిగిన కాల్పుల్లో డజనకు పైగా పౌరులు మరణించిన సంగతి తెలిసిందే.

లోపలి పేజీలో..

చిరుద్యోగులపై కక్ష సాధింపు వద్దు

- విభజన సమస్యల పరిష్కారానికి కమిటీల ఏర్పాటును స్వాగతిస్తున్నాం
- జక్కా వెంకయ్య భవన్ ప్రారంభంలో శ్రీనివాసరావు

కేరళలో డిజిటల్ విద్య భేష్

- అది అన్ని దేశాలకూ ఆదర్శం
- ఎడ్‌టెక్ నమూనాపై యునిసెఫ్ ప్రశంసలు



పూరి రథయాత్రకు హాజరైన యాత్రికులు

పూరి రథయాత్రలో అపశృతి

- ఊపిరాడక ఒకరి మృతి
- అనేక మందికి గాయాలు

పూరి : ఆదివారం పూరిలో ప్రారంభమైన రథయాత్రలో అపశృతి చోటు చేసుకుంది. రథం లాగుతుండగా భారీ జనం మధ్యలో ఒక భక్తుడు ఊపిరాడక ప్రాణాలు కోల్పోయాడు. మృతుడ్ని ఇంకా గుర్తించలేదు. దాదాపు 300 మందికి స్వల్పగాయలైనట్లు సమాచారం. గాయాల పాలైన వారిని స్థానిక ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. గాయపడిన వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. రథం లాగడానికి జనం ఒక్కసారిగా తోసుకుని రావడంతో తొక్కిసలాట వంటి పరిస్థితి తలెత్తిందని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. పూరిలో ఆదివారం అధిక వేడిగాలులు ప్రజల్ని ఇబ్బంది పెట్టాయి. సాయంత్రం 5:20 గంటలకు రథయాత్ర ప్రారంభమైంది. ఆచారం ప్రకారం బలభద్రుని తాళధ్వజ రథం ముందుగా ముందుకు కదిలింది. బలభద్రుని రథం లాగే సయయంలోనే ఈ పరిస్థితి తలెత్తిందని సమాచారం.

రథయాత్ర కోసం పూరీ పట్టణానికి సుమారు 10 లక్షల మంది తరలివచ్చినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.

ఫ్రాన్స్ ఎన్నికల్లో లెఫ్ట్ జయకేతనం

- రెండో స్థానంలో మాక్రాన్ పార్టీ
- మూడో స్థానంలో లీపెన్ పార్టీ



లెఫ్ట్ విజయం పట్ల కార్యకర్తల సంబరాలు

పారిస్: ఫ్రాన్స్ పార్లమెంటు ఎన్నికల్లో వామపక్ష, ప్రగతిశీల కూటమి న్యూ పాపులర్ ఫ్రంట్ అత్యధిక సీట్లు గెలుచుకునే దిశగా పయనిస్తోంది. ప్రాథమికంగా అందిన సమాచారాన్ని బట్టి మెరైన్ లీపెన్ నేతృత్వంలోని నియో ఫాసిస్టు పార్టీ నేషనల్ ర్యాలీ (ఆర్ఎన్) మూడో స్థానంలోకి దిగజారింది. మాక్రాన్ నేతృత్వంలోని రినైజాన్స్ పార్టీ అనూహ్యంగా రెండో స్థానంలోకి వచ్చింది. 577 సీట్లు ఉన్న పార్లమెంటులో సాధారణ మెజార్టీకి అవసరమైన 289 స్థానాలు ఏ పార్టీకి లేదా కూటమికి దక్కే సూచనలు కనబడడం లేదు. లీపెన్ పార్టీ ఫాసిస్టు ఎజెండాకు ప్రత్యామ్నాయంగా సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య పరిరక్షణ వంటి అంశాలతో ముందుకొచ్చిన న్యూ పాపులర్ ఫ్రంట్ (ఎన్‌పిఎఫ్)ను ప్రజలు ఆదరించారు. కమ్యూనిస్టు పార్టీ, సోషలిస్టు పార్టీ, గ్రీన్స్, ఫ్రాన్స్ అన్‌బౌండ్ వంటి వామపక్ష ప్రగతిశీల శక్తులతో కూడిన పాపులర్ ఫ్రంట్ మొదటి రౌండ్‌లో 28.1 శాతం ఓట్లతో రెండవ స్థానంలో నిలిచింది. రెండో రౌండ్‌లో నియో ఫాసిస్టు పార్టీని వెనక్కి నెట్టి మొదటి స్థానంలో నిలిచింది. ఫ్రాన్స్ టెలివిజన్, రేడియో ఫ్రాన్స్, ఫ్రాన్స్ 24 వెల్లడించిన ప్రాథమిక అంచనా ప్రకారం ఎన్‌పిఎఫ్‌కు 172 నుంచి 192 సీట్లు దాకా వచ్చే అవకాశముంది,. మాక్రాన్ పార్టీకి 150నుంచి 170 దాకా వచ్చే అవకాశముంది. లీపెన్ పార్టీకి 132 నుండి 152 వరకు మాత్రమే సీట్లు వస్తాయని తెలుస్తోంది. మొదటి రౌండర్‌లో నేషనల్ ర్యాలీ కన్నా 5 శాతం ఓట్ల తేడాతో రెండవ స్థానంలో నిలిచిన పాపులర్ ఫ్రంట్ రెండవ రౌండ్‌లో తన ఓటింగ్ బలాన్ని బాగా పెంచుకుంది. అధ్యక్షుడు ఇమానియెల్ మాక్రాన్ నాయకత్వంలోని రినైజాన్స్ పార్టీ ఊహించని విధంగా రెండో రౌండ్‌లో పుంజుకుంది. 577 సీట్లు ఉన్న ఫ్రాన్స్ పార్లమెంటులో మొదటి రౌండ్‌లో 76 మంది ఎన్నిక కాగా, మిగతా 506 స్థానాలకు రెండో రౌండ్‌లో ఎన్నికలు జరిగాయి. పార్లమెంటులో సాధారణ మెజార్టీ సాధించాలంటే కనీసం 289 సీట్లు రావాలి. పోలింగ్ సరళి చూస్తే మొదటి రౌండ్ కన్నా రెండో రౌండ్‌లో కొంచెం ఎక్కువ ఓట్లు పోలయ్యాయి. ఉదయం 7 గంటల నుంచి రాత్రి 8 వరకు పోలింగ్ జరిగింది. మధ్యాహ్నానికి 26.68శాతం, సాయంత్రం 5 గంటలకు 59.71 శాతం, పోలింగ్ ముగిసే సమయానికి 67 శాతం ఓట్లు పోలైనట్లు ఆంతరంగిక శాఖ తెలిపింది.

నేడు 'విద్యుత్'పై శ్వేతపత్రం

- అప్పులు, భారాలు వెల్లడి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యుత్ రంగంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శ్వేతపత్రం సోమవారం విడుదల చేయనున్నారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో విద్యుత్ రంగంలో జరిగిన పరిణామాలను వెల్లడించనున్నారు. గత ప్రభుత్వం ప్రజలపై మోపిన భారాలు, విద్యుత్ సంస్థలు చేసిన అప్పులపైనే ముఖ్యంగా వెల్లడించే అవకాశం ఉంది. గత ప్రభుత్వంలో విద్యుత్ రంగం అప్పులు రూ.1.12 లక్షల కోట్ల వరకు చేరుకున్నాయని అధికారులు లెక్క తేల్చినట్లు తెలిసింది. అదేవిధంగా రూ.18 వేల కోట్ల వరకు ప్రజలపై వివిధ భారాలు మోపారు. శ్లాబుల మార్పు, ట్రూఅప్, ఇంధన సర్దుబాటు తదితర ఛార్జీల పేరుతో గత ప్రభుత్వం భారీ వడ్డన మోపింది. షిర్డీ సాయి ఎలక్ట్రానిక్స్ కేటాయించిన కాంట్రాక్టులపైనా చర్చించే అవకాశం ఉన్నట్లు తెలిసింది. ట్రాన్స్‌ఫార్మర్లను అధిక ధరకు కొనుగోలు చేసినట్లు కూడా చెప్పనున్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

చారిత్రక భేటీగా నిలిచిపోవాలి

- ఇద్దరు సిఎంల సమావేశంపై చలసాని శ్రీనివాస్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర విభజన తర్వాత రెండు తెలుగు రాష్ట్రాల మధ్య వున్న సమస్యల పరిష్కారం కోసం ఇద్దరు ముఖ్యమంత్రులు సమావేశం కావడాన్ని స్వాగతిస్తున్నామని ప్రత్యేక హోదా సాధన సమితి అధ్యక్షులు చలసాని శ్రీనివాస్ తెలిపారు. ఇద్దరు ముఖ్యమంత్రులు సమావేశమై తీసుకున్న నిర్ణయాలు చారిత్రాత్మక అంశాలుగా నిలిచిపోయేలా ఒప్పందాలు జరగాలని అన్నారు. విజయవాడలోని ఎంబివికెలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. రెండు రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం తీరని ద్రోహం చేసిందని విమర్శించారు. రెండు రాష్ట్ర ప్రభుత్వాలు నిధుల కోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం వుందన్నారు. రాష్ట్రానికి సంబంధించి పోలవరం ముంపు, పునరావాసం సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలన్నారు. విద్యుత్ బకాయిలకు సంబంధించి కూడా సామరస్యంగా పరిష్కరించుకోవాలన్నారు. షెడ్యూల్ 9, 10లోని ఉమ్మడి ఆస్తుల పంపకం, కృష్ణా, గోదావరి నీటి వాటాలు సామరస్యంగా పరిష్కారం కావాలన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు రాబట్టేందుకు రెండు రాష్ట్రాలు ఒత్తిడి పెంచాలని కోరారు. రెండు రాష్ట్రాల్లోని సాగునీటి ప్రాజెక్టులను కేంద్రప్రభుత్వం ఆధీనంలోకి వెళ్లకుండా రెండు రాష్ట్ర ప్రభుత్వాలు ఒకే మాటపై నిలవాలని కోరారు.

తెలుగు రాష్ట్రాలు నాకు రెండు కళ్లు

(మొదటి పేజీ తరువాయి)

కాంగ్రెస్, బిఆర్ఎస్ కొనసాగించాయని అన్నారు. ఇప్పుడు సిఎం రేవంత్‌రెడ్డి కూడా అదే తరహాలో పనిచేస్తున్నారని పేర్కొన్నారు. తెలుగు రాష్ట్రాలు ఐకమత్యంగా ఉంటేనే తెలుగు భాష, జాతి ప్రయోజనాలు పరిరక్షించబడతాయన్నారు. విభజన సమస్యల పరిష్కారానికి తానే చొరవ తీసుకున్నానని, దాన్ని స్వాగతించినందుకు తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఇరు రాష్ట్రాల మధ్య వివాదం ఉంటే నష్టాలే ఎక్కువన్నారు. ఇచ్చిపుచ్చుకునే ధోరణితోనే సమస్యలు పరిష్కారమవుతాయని పేర్కొన్నారు. ఎపి, తెలంగాణలోని ప్రభుత్వాల సిద్ధాంతాలు, ఆలోచనలు వేరుగా ఉన్నప్పటికీ తెలుగుజాతి ప్రయోజనాల కోసం కలిసి పనిచేస్తామన్నారు. 2019 తర్వాత ఎపిలో విధ్వంస ప్రభుత్వం వచ్చిందని, రాష్ట్ర విభజన నష్టం కంటే వైసిపి ఐదేళ్ల పాలనతో జరిగిన నష్టమే ఎక్కువని చంద్రబాబు పేర్కొన్నారు. ఎన్నికలకు ముందు టిడిపి నిర్వహించిన యువగళం, నిజం గెలవాలి కార్యక్రమాలు ప్రాచుర్యం పొందాయన్నారు. ఎన్నికల్లో ఓటు వేసేందుకు హైదరాబాద్ నుంచి 70 రైళ్లలో ఎపికి ప్రజలు తరలివచ్చారన్నారు. రూ.లక్షలు ఖర్చు పెట్టుకుని ఎన్ఆర్ఐలు వచ్చారని గుర్తు చేశారు. రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని అందరూ మద్దతివ్వడంతో ఎపి ఎన్నికల్లో టిడిపి నేతృత్వంలోని కూటమి సునామీ సృష్టించిందన్నారు. రాష్ట్రాన్ని గట్టెక్కించేందుకు శక్తివంచనలేకుండా కృషి చేస్తానన్నారు. అంతకుముందు జూబ్లిహిల్స్‌లోని నివాసం నుంచి ఎన్‌టిఆర్ ట్రస్ట్ భవన్ వరకు చంద్రబాబు కాన్వాయ్‌ను అనుసరిస్తూ టిడిపి కార్యకర్తలు, అభిమానులు భారీ ర్యాలీ నిర్వహించారు. డప్పు దరువులు, స్థానిక కళాకారుల ఆటపాటలతో టపాసులు పేల్చి టిడిపి కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు.

చిరుద్యోగులపై కక్ష సాధింపు వద్దు

- విభజన సమస్యల పరిష్కారానికి కమిటీల ఏర్పాటును స్వాగతిస్తున్నాం
- జక్కా వెంకయ్య భవన్ ప్రారంభంలో వి శ్రీనివాసరావు



జక్కా వెంకయ్య భవన్ (సిపిఎం కార్యాలయం)ను ప్రారంభిస్తున్న వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి- నెల్లూరు

రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన టిడిపి కూటమి ప్రభుత్వం చిరుద్యోగులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడొద్దని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. నెల్లూరులోని అపోలో సెంటర్‌లో నిర్మించిన జక్కా వెంకయ్య భవన్ (సిపిఎం కార్యాలయం)ను ఆదివారం ప్రారంభించారు. తొలుత సిపిఎం శ్రేణులు ముత్తుకూరు గేట్ సెంటర్ నుంచి అపోలో సెంటర్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించాయి. అనంతరం జక్కా వెంకయ్య భవన్ వద్ద ఆయన మాట్లాడుతూ జక్కా వెంకయ్య భవనం ప్రజాసమస్యల పరిష్కారానికి, ఉద్యమాల రూప కల్పనకు కేంద్ర బిందువుగా నిలవాలన్నారు. జక్కా వెంకయ్య జీవించి ఉన్నంత కాలం డాక్టర్ రామచంద్రారెడ్డి భవన్ ఏ తరహాలో ప్రజా సేవకు అంకితమైందో అదే విధంగా ఈ భవనం కూడా పేరు గడించాలని ఆకాంక్షించారు. రాష్ట్ర విభజన సమస్యల పరిష్కారమే అజెండాగా ఎపి, తెలంగాణ ముఖ్యమంత్రులు హైదరాబాద్‌లో సమావేశం కావడాన్ని, రెండు కమిటీలను ఏర్పాటు చేయడాన్ని సిపిఎం స్వాగతిస్తోందన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో తక్కువ సంఖ్యా బలం ఉన్న బీహార్ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ ఆ రాష్ట్రానికి ప్రత్యేక హోదా కావాలని అడిగారని, అంతకన్నా ఎక్కువమంది సభ్యులున్న టిడిపి మాత్రం ప్రత్యేక హోదా అడగకపోవడం శోచనీయమని అన్నారు. అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు, స్కీమ్ వర్కర్లు వంటి చిరుద్యోగులపై వేధింపులకు పాల్పడుతున్నట్లు వార్తలు, కథనాలు వస్తున్నాయన్నారు. వేధింపులను మానుకోవాలని కోరారు. సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ మాట్లాడుతూ సోమశిల అప్రాన్‌కు తక్షణమే మరమ్మతులు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. టిడ్కో ఇళ్ల రుణ బకాయిలు చెల్లించాలంటూ లబ్ధిదారులకు బ్యాంకు అధికారులు నోటీసులు పంపిస్తున్నారన్నారు. ప్రభుత్వం టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు వెంటనే పంపిణీ చేయాలని కోరారు. సభకు 17వ డివిజన్ సిపిఎం శాఖా కార్యదర్శి కట్టా సతీష్ అధ్యక్షత వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు, ఎం.మోహనరావు, సిపిఎం నగర, రూరల్ కార్యదర్శులు కత్తి శ్రీనివాసులు, బత్తల కృష్ణయ్య, ఐద్వా నాయకులు జక్కా శేషమ్మ తదితరులు ప్రసంగించారు.

పవన్‌తో పల్లా భేటీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్‌తో టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు భేటీ అయ్యారు. పవన్‌కల్యాణ్ ఆహ్వానం మేరకు శనివారం రాత్రి ఆయన నివాసానికి వెళ్లిన పల్లా గంటన్నరపాటు రాష్ట్రాభివృద్ధితోపాటు నామినేటెడ్ పోస్టుల పంపకంపైనా చర్చించుకున్నట్లు సమాచారం. రాష్ట్రంలో జనసేన, టిడిపి శ్రేణుల మధ్య సమన్వయం ద్వారా రాష్ట్రానికి అత్యంత ప్రయోజనం కలిగేలా వ్యవహరించాలని ఇరు పార్టీల నేతలు నిర్ణయం తీసుకున్నారు. క్షేత్రస్థాయిలో వ్యవహరించాల్సిన అంశాలపై ఇరువురు నేతలు చర్చించారు. భారీ విజయాన్ని కట్టబెట్టిన ప్రజల తీర్పునకు అనుగుణంగా ఈ మైత్రి కొనసాగేలా చర్యలుండాలని ఇరువురు నేతలు ఆకాంక్షించారు. ఎక్కడైనా బేదాభిప్రాయాలు తలెత్తితే సూచనలు కనిపించిన వెంటనే వాటిని సరిదిద్దేందుకు మార్గదర్శకాలివ్వాలని నిర్ణయించారు.

హద్దులు దాటితే చర్యలు : జనసేన

టిడిపి కూటమి ప్రభుత్వానికి రాష్ట్రంలో జనసేన శ్రేణులన్నీ వెన్నుదన్నుగా నిలవాలని, ఏ పార్టీకి చెందిన వారైనా ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడొద్దని జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. ఈ మేరకు పార్టీ కార్యాలయం ఆదివారం ఒక ప్రకటన విడుదల చేసింది. రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొంది. ఈ తరుణంలో పార్టీ నియమ నిబంధనలను ఉల్లంఘించి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా పార్టీలోని ఏ స్థాయి వారు మాట్లాడినా, అధికారుల పనితీరును బలహీనపరిచేలా ఆధారాలు లేని ఆరోపణలు చేసినా కఠిన చర్యలు తీసుకోవాలని క్రమశిక్షణ చర్యలు పర్యవేక్షించే బాధ్యులను పవన్‌కల్యాణ్ ఆదేశించారు. ప్రొటోకాల్ ఉల్లంఘించి అధికారిక సమావేశాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనడం, నిబంధనలను ఉల్లంఘించడమే అవుతుందన్నారు. అటువంటి వారిపై చర్యలు తప్పవన్నారు.

ఎక్సైజ్ శాఖ ప్రక్షాళనతో గీత కార్మికులకు ఉపాధి

- కల్లు గీత కార్మిక సంఘం డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా కల్లుగీత వృత్తిని ఆధునీకరించి, లక్షలాది మందికి ఉపాధి కల్పించేలా ప్రోత్సహించేందుకు నూతన కల్లు విధానాన్ని రూపొందించాలని ఆంధ్రప్రదేశ్ కల్లుగీత కార్మిక సంఘం డిమాండ్ చేసింది. కల్లుగీత ఆర్థిక కార్పొరేషన్‌ను పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని కోరింది. విజయవాడలోని మాకినేని బసవ పున్నయ్య భవన్‌లో ఎపి కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు వాకా రామచంద్రయ్య అధ్యక్షతన రాష్ట్ర కమిటీ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుత్తిగ నరసింహమూర్తి, వృత్తి సంఘాల సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనరు మున్నూరు భాస్కరయ్య మాట్లాడారు. గత ప్రభుత్వం కల్లుగీత వృత్తిని ధ్వంసం చేసిందని విమర్శించారు. కల్లు అనేది ఔషధ గుణాలున్న పానీయంగా శాస్త్రీయంగా నిరూపణ అయ్యిందన్నారు. పాలకులు మద్యాన్ని ప్రోత్సహించేందుకు కల్లుగీతను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. కొత్త ప్రభుత్వమైనా కల్లుగీత వృత్తిని పరిరక్షించేందుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రూపొందించే కల్లు విధానంలో కల్లుగీత కార్పొరేషన్‌ను పునరుద్ధరించా లని, అలాగే ఆదరణ పథకాన్ని తీసుకురావాలని, వృత్తిలో వున్న వారందరికీ ఉచితంగా మోటార్ సైకిల్ ఇవ్వాలని, ప్రతి తాటిచెట్టుకూ రూ.10 పన్నును వసూలు చేసి వాటికి రక్షణ కల్పించాలని, కల్లు ఎక్కువ కాలం నిలువ వుండేలా పరిశోధనలను ప్రభుత్వం ప్రోత్సహించాలని డిమాండ్ చేశారు. వృత్తిదారులు మరణిస్తే నెలరోజుల్లో ఎక్స్‌గ్రేషియా చెల్లించేలా చర్యలు తీసుకోవాల న్నారు. ప్రతి కల్లుగీత కార్మికుడికీ బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో కల్లుగీత కార్మిక సంఘం నాయకులు కామన మునుస్వామి, ఎర్ర దేవుడు, బత్తిన నాగేశ్వరరావు, కడలి పాండు, చిమ్మ అప్పారావు, టి కోటేశ్వరరావు, బెజవాడ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కొత్త బస్సులతో ప్రజారవాణా బలోపేతం

- ఎపిపిటిడి ఎంప్లాయీస్ యూనియన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించాలని తీసుకున్న విధానపరమైన నిర్ణయాన్ని విజయవంతంగా అమలు చేసేందుకు తక్షణం కొత్త బస్సులను కొనుగోలు చేయాలని ఎపిపిటిడి ఎంప్లాయీస్ యూనియన్ కోరింది. గత ప్రభుత్వ హయాంలో బస్సులు కొనుగోలు చేయని కారణంగా కుదించిన బస్సు రూట్లు మళ్లీ పునరుద్ధరించి ప్రజా రవాణా వ్యవస్థను బలోపేతం చేయాలని విజ్ఞప్తి చేసింది. విజయవాడలోని ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యాలయంలో యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి ఓబులేసు, ఎపిజెఎసి అమరావతి రాష్ట్ర ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పలిశెట్టి దామోదరరావు, జివి నర్సయ్య మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో ఉద్యోగులకు చెల్లించాల్సిన 11వ పిఆర్‌సి బకాయిలు, పెండింగ్‌లో వున్న డిఎ ఎరియర్స్, చనిపోయిన, రిటైర్డు అయిన ఉద్యోగులకు బకాయిలు చెల్లంచాలని, హెల్త్ కార్డులు వినియోగం, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రభుత్వ పథకాలను వర్తింపజేయడం, కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరణ వంటి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఆర్‌టిసి ఉద్యోగులకు విలీనం పేరుతో రిఫరల్ ఆస్పత్రుల వైద్యసౌకర్యాలను తొలగించి అన్యాయం చేసిందన్నారు. ప్రస్తుతం ప్రతి ఉద్యోగి నుంచి రూ.225 నుంచి రూ.300 వరకు జీతాల్లో రికవరీ చేస్తున్నా, సరైన వైద్యసేవలు అందడం లేదన్నారు. ఈ ఐదేళ్ల కాలంలో కారుణ్య నియామకాలు తప్ప ఆర్‌టిసిలో నియామకాలే జరగలేదని, దీంతో సిబ్బంది కొరత ఆర్‌టిసిని వేధిస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు సుబ్రమణ్యంరాజు, నారాయణరావు, ప్రసాద్, భానుమూర్తి, కె నాగేశ్వరరావు, సిద్ధిక్ పాల్గొన్నారు.

డయేరియాతో పారిశుధ్య కార్మికుడు మృతి

ప్రజాశక్తి-పిడుగురాళ్ల (పల్నాడు జిల్లా)



డయేరియాతో మున్సిపల్ పారిశుధ్య కార్మికుడు మృతి చెందిన సంఘటన పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పిడుగురాళ్ల పట్టణానికి చెందిన పరస బాలకృష్ణ (40) మున్సిపాల్టీ పారిశుధ్య విభాగంలో కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేస్తున్నారు. పట్టణంలోని లెనిన్ నగర్‌లో డయేరియా ప్రబలడంతో శుక్రవారం ఆ ప్రాంతంలో పారిశుధ్య పనులు చేసేందుకు వెళ్లారు. అందుబాటులో ఎవరూ లేకపోవడంతో డబుల్ డ్యూటి చేసి ఇంటికి వచ్చారు. అదే రోజు రాత్రి వాంతులు, విరేచనాలతో ఇబ్బంది పడుతుండడంతో కుటుంబ సభ్యులు పట్టణంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో గుంటూరు జిజిహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందారు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. తమకు రక్షణ పరికరాలు, ఇతర సౌకర్యాలు అందుబాటులో లేకపోవడం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని తోటి కార్మికులు ఆందోళన వ్యక్తం చేశారు. బాలకృష్ణ భౌతికకాయాన్ని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఏపూరి గోపాలరావు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు సందర్శించి నివాళులర్పించారు. మృతుని కటుంబానికి రూ.20 లక్షల పరిహారం, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

తెలంగాణాలో బోనాల సందడి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో ఆషాడ మాస బోనాల సందడి మొదలైంది. ఆదివారం మహిళలు పెద్దఎత్తున బోనాలతో గోల్కొండలోని జగదాంబికా అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. దీంతో గోల్కొండ వద్ద బోనాల సందడి నెలకొంది. డప్పు చప్పుళ్లు, తీన్మార్ దరువులతో ఆ ప్రాంతమంతా మార్మోగింది. పోతరాజుల వీరంగాలు, శివసత్తుల ఆటలతో జాతర శోభ సంతరించుకుంది. దశాబ్ది బోనాల వేడుకల పేరుతో ఈసారి ప్రభుత్వం బోనాలను మరింత శోభాయమానంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసింది. రూ.20 కోట్ల నిధులను కేటాయించింది. గోల్కొండ జగదాంబిక అమ్మవారికి ఆషాఢమాసం మొత్తం గురు, ఆదివారాల్లో బోనాలను నిర్వహించనున్నారు. ఆదివారం ఆలయంలో నిర్వహించిన తొలి పూజకు ప్రభుత్వం తరపున దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించారు. లంగర్ హౌస్ నుంచి ఊరేగింపుగా వెళ్లి... చోటాబజార్‌లోని పూజారి ఇంట్లో ఉన్న అమ్మవారి ఉత్సవ విగ్రహాలకు మంత్రి పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం బంజారా దర్వాజ వైపు నుంచి నజర్ బోనంతో అమ్మవారిని ఊరేగింపుగా గోల్కొండ కోట ఆలయానికి తోడుకొని వచ్చారు. ఆగస్టు 4 వరకు గోల్కొండలో బోనాల ఉత్సవాలు కొనసాగనున్నాయి. అనంతరం ఈ నెల 21, 22 తేదీల్లో సికింద్రాబాద్ ఉజ్జయిని మహాకాళి.. 28, 29 తేదీల్లో లాల్ దర్వాజా బోనాలు జరగనున్నాయి.




మణిపాల్ ఆస్పత్రిలో బాధితులను పరామర్శిస్తున్న కలెక్టర్ సృజన

'అల్ట్రాటెక్'లో ఘోరం

(మొదటి పేజీ తరువాయి)

వందలాది మంది గ్రామస్తులు ఆగ్రహంతో ఫ్యాక్టరీ వద్దకు చేరుకున్నారు. ఫ్యాక్టరీ అడ్మినిస్ట్రేషన్ బ్లాక్‌పై దాడి చేశారు. డిసిపి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోలీసులు ఫ్యాక్టరీ వద్దకు చేరుకొని బందోబస్తు నిర్వహి స్తున్నారు. ఎసిపి రవికిరణ్ మాట్లాడుతూ అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేశామని, గాయపడిన వారిని మెరుగైన చికిత్సకు తరలించామని తెలిపారు. నందిగామ ఆర్‌డిఒ రవీంద్రరావు ఈ ఫ్యాక్టరీని పరిశీలించారు. ఇద్దరు కార్మికులు మృతి చెందిన సమాచారం తెలుసుకొన్న గ్రామస్తులు ఫ్యాక్టరీని ముట్టడించడానికి ప్రయత్నించారు. వారిని పోలీసులు అడ్డుకున్నారు.

క్షతగ్రాతులకు ఎమ్మెల్యే, కలెక్టర్ పరామర్శ

మణిపాల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్, కలెక్టర్ జి.సృజన పరామర్శించారు. ప్రత్యేక వైద్య బృందాలతో మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు తీసుకోవాలని వైద్య, ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. ప్రమాదంలో గాయపడిన వారి బంధువులతో మాట్లాడారు.

యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి : సిఐటియు

ఈ ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపించి ఫ్యాక్టరీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు డిమాండ్ చేశారు. ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితులను ఆయనతోపాటు సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్‌సిహెచ్ శ్రీనివాస్, ఎ.వెంకటేశ్వరరావు, జిల్లా నాయకులు డివి కృష్ణ పరామర్శించారు. సంఘటనకు దారి తీసిన పరిస్థితులను కార్మికుల కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నర్సింగరావు మాట్లాడుతూ ప్రమాదంలో మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు రూ.50 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని, గాయపడిన కార్మికులందరినీ మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని అపోలో ఆస్పత్రికి వెంటనే తరలించాలని డిమాండ్ చేశారు.


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఐద్వా, ప్రజా సంఘాల నాయకులు

బాలిక హత్య కేసులో నిందితుడిని శిక్షిస్తాం

- రాష్ట్ర హోం మంత్రి అనిత

ప్రజాశక్తి - అనకాపల్లి, రాంబిల్లి విలేకరులు



మీడియాతో మాట్లాడుతున్న హోం మంత్రి అనిత

అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం కొప్పుగొండుపాలెం గ్రామంలోని తొమ్మిదో తరగతి చదువుతున్న బాలికను హత్య చేసిన సురేష్‌ను పట్టుకుని శిక్షించి తీరుతామని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. అనకాపల్లిలో ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ మైనరైన బద్రి దర్శినిని హత్య చేసిన సంఘటనపై ఇప్పటికే ఎస్‌పి మురళీకృష్ణతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్ మాట్లాడారని తెలిపారు. నిందితున్ని పట్టుకునేందుకు తొమ్మిది బృందాలను నియమించామని చెప్పారు. నిందితుడు సదరు బాలికను వేధించిన కేసులో చట్ట పరిధిలో అరెస్టయి బెయిల్‌పై వచ్చి ఈ ఘాతుకానికి ఒడిగట్టాడని తెలిపారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వపరంగా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. తమ ప్రభుత్వం ఇటువంటి సంఘటనలను తీవ్రంగా పరిగణిస్తుందని తెలిపారు. చీరాలలో ఇటీవల జరిగిన ఓ ఘటనలో 36 గంటల్లోనే నిందితులను పోలీసులు అరెస్టు చేశారని వివరించారు. రాష్ట్రంలో గంజాయిని పూర్తి స్థాయిలో నియంత్రిస్తే ఇటువంటి సంఘటనలు జరగవన్నారు. ఉన్న చట్టాలను బలోపేతం చేస్తామని, న్యాయ నిపుణుల సలహాలతో చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బాధిత కుటుంబానికి ప్రజా సంఘాల పరామర్శ

దర్శిని కుటుంబాన్ని కొప్పుగొండుపాలెంలో ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు బి ప్రభావతి, అనకాపల్లి జిల్లా అధ్యక్షులు పి మాణిక్యం, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి దేవుడు నాయుడు, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు చింతకాయల శివాజీ పరామర్శించారు. బాలిక హత్యకు గురికావడం పట్ల సంతాపం ప్రకటించారు. నిందితుడిని పోలీసులు వెంటనే అరెస్ట్ చేసి, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పోక్సో చట్టం కింద అరెస్టయి, బెయిల్‌పై బయటకు వచ్చిన నిందితుని పట్ల పోలీసులు అప్రమత్తంగా లేకపోవడం వల్లే ఈ ఘటన జరిగిందన్నారు. తమ అమ్మాయి నిందితుని వల్ల ఇబ్బంది పడుతోందని బాధిత కుటుంబ సభ్యులు స్థానిక పోలీస్ స్టేషన్‌కి వెళ్లి మూడు పర్యాయాలు చెప్పినప్పటికీ పోలీసులు సరైన చర్యలు చేపట్టలేదని వివరించారు. ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు. ఈ ప్రాంతంలో గంజాయి, మద్యం ఏరులైపారుతున్న నేపథ్యంలో పోలీసు పెట్రోలింగ్ పటిష్టంగా చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు భూపతి అప్పారావు, నాగమంత్రి నారాయణరావు, ధోని కాశీ, సిహెచ్.నూకన్న, బాలాజీ, బాబూరావు, అప్పారావు పాల్గొన్నారు.

కేవ్ బార్ అండ్ పబ్‌పై పోలీసుల దాడి

- 55 మందికి డ్రగ్స్ పరీక్షలు
- 24 మందికి పాజిటివ్
- వివరాలు వెల్లడించిన మాదాపూర్ డిసిపి వినీత్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కేవ్ బార్ అండ్ పబ్‌పై శనివారం రాత్రి నార్కోటిక్స్, ఎస్‌ఒటి పోలీసులు దాడి చేసి 55 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారికి డ్రగ్స్ పరీక్షలు నిర్వహించగా.. 24 మందికి పాజిటివ్ వచ్చింది. వీరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఆ ఘటన తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లా రాయదుర్గం పిఎస్ ఖాజాగూడలో ఆదివారం చోటుచేసుకుంది. ఈ కేసుకు సంబంధించిన వివరాలను గచ్చిబౌలిలోని మాదాపూర్ డిసిపి కార్యాలయంలో డిసిపి వినీత్ ఆదివారం మీడియాకు వెల్లడించారు. దీని ప్రకారం.. కేవ్ బార్ అండ్ పబ్‌లో ఫారెస్ట్ సైకడాలిక్ థీమ్‌తో పార్టీ నిర్వహించారు. ఇందులో పాల్గొనే వారికి ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ఆహ్వానం అందింది. వారికి ప్రత్యేకమైన కోడ్ ఉంటుంది. సైకడాలిక్ థీమ్‌లో ఎలక్ట్రానిక్ మ్యూజిక్ హై పిచ్‌లో ఉంటుంది.. డ్రగ్స్ తీసుకున్న వారు మాత్రమే ఆ మ్యూజిక్ ఎంజాయ్ చేయగలరు. సామాన్యులు అంతటి డెసిబెల్స్ శబ్దాన్ని వినలేరు. ఈ పార్టీలో 55 మంది పాల్గొన్నారు. పక్కా సమాచారంతో నార్కోటిక్స్, ఎస్‌ఒటి, రాయదుర్గం పోలీసులు సంయుక్తంగా పబ్‌పై దాడులు నిర్వహించి 55 మందిని అదుపులోకి తీసుకుని డ్రగ్స్ పరీక్షలు నిర్వహించారు. వీరిలో 24 మందికి పాజిటివ్ వచ్చింది. ఈ పార్టీకి హాజరైన వారిలో ప్రముఖ కంపెనీల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, విద్యార్థులు ఉన్నారు. డిజె ఆపరేటర్ అబ్దుల్ ఆయూబ్, గౌరంగ్, పబ్ మేనేజర్ ఆర్ శేఖర్‌ను అదుపులోకి తీసుకున్నారు. నలుగురు పబ్ ఓనర్లలో ఒకరిని అదుపులోకి తీసుకోగా మరో ముగ్గురు పరారీలో ఉన్నారు. 24 మందిపై ఎన్‌డిపిఎస్ సెక్షన్ కింద పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణ అనంతరం పబ్‌ను మూసేయించివేస్తున్నట్టు డిసిపి వినీత్ తెలిపారు. అన్ని పబ్‌లను తనిఖీ చేస్తామన్నారు.

కూటమిలో 'నామినేటెడ్' పంపకాలు

- పదవులు కోరుతున్న జనసేన, బిజెపి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న నామినేటెడ్ పోస్టుల పంపకాలపై టిడిపి కూటమిలో చర్చలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న వివరాలను సోమవారం ఉదయంలోపు అందించాలని సాధారణ పరిపాలనశాఖ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. వీటితోపాటు సొసైటీ, ప్రత్యేక బాడీల్లో ఉన్న పోస్టుల వివరాలు కూడా అందించాలని తెలిపింది. దీంతో కూటమిలోని పార్టీలు ఏ పార్టీకి ఎన్ని పోస్టులు ఇవ్వాలి, ఏ పోస్టులు ఎవరికి ఇవ్వాలి అనే అంశంపై కసరత్తు జరుగుతోంది. వివిధ శాఖల్లో సుమారు 95 కార్పొరేషన్ ఛైర్మన్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు సమాచారం. వీటిల్లో 25 ఛైర్మన్ పోస్టులు జనసేన కోరినట్లు తెలిసింది. అయితే జనసేనకు, బిజెపికి ఎన్ని కేటాయిస్తారనేది తెలియాల్సి ఉంది. 2014-19 టిడిపి అధికారంలో ఉన్న సమయంలో బిజెపికి, జనసేనకు ఎలాంటి కార్పొరేషన్ ఛైర్మన్ పదవులు ఇవ్వలేదు. జనసేన కూడా ప్రత్యక్షంగా ఎన్నికల్లో పోటీ చేయకపోవడంతో ఈ ప్రస్తావన కూడా రాలేదు. ఇప్పుడు కూటమిలో ఎవరికి ఏం కేటాయిస్తారనేది వేచిచూడాల్సి ఉంది. టిడిపిలో నామినేటెడ్ పోస్టులు కోరుతున్న వారిలో ఆశావహులు భారీగానే ఉన్నారు. మూడేళ్ల వరకు ఎమ్మెల్సీ పోస్టులు కూడా ఖాళీ అయ్యే అవకాశం లేదు. కేవలం ఐదు ఖాళీలు మాత్రమే వచ్చే ఏడాది రానున్నాయి. మాజీ మంత్రులు, సీనియర్ నాయకులు కూడా నామినేటెడ్ పోస్టులను దక్కించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే టిడిపి కార్యాలయంలో ఆశావహుల నుంచి దరఖాస్తు స్వీకరణ జరుగుతోంది. ప్రతిపక్షంలో ఉన్న సమయంలో పార్టీకి ఎవరు ఎలా పనిచేశారన్న అంశం ప్రాతిపదికగా అంతర్గతంగా ర్యాంకులు ఇవ్వాలని యోచిస్తోంది. ఇందుకు అనుగుణంగా పదవుల్లో అవకాశం ఇవ్వాలని చూస్తోంది. ఆశావహుల నుంచి వచ్చిన దరఖాస్తులను తొలుత టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ స్క్రూటినీ చేస్తారని టిడిపి నాయకులు చెబుతున్నారు. అనంతరం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు తుది నిర్ణయం తీసుకుంటారని అంటున్నారు.

స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకుంటాం : సిఐటియు

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను పోరాటాలతో రక్షించుకుంటామని స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) అధ్యక్షులు జి రమణ, ప్రధాన కార్యదర్శి ఎన్ రమణ స్పష్టం చేశారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు ఆదివారానికి 1192వ రోజుకు చేరాయి. దీక్షల్లో స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ వర్కర్స్ కూర్చున్నారు. వారినుద్దేశించి నాయకులు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను కేంద్ర ప్రభుత్వం నిలుపుదల చేయాలని, ఖాళీగా ఉన్న ఉద్యోగాలన్నీ భర్తీ చేయాలని, కాంట్రాక్టు కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. వర్కింగ్ క్యాపిటల్, సొంత గనులు కేటాయిస్తే ప్లాంట్ త్వరితగతిన లాభాలబాట పడుతుందన్నారు. ఉక్కు కర్మాగారం వల్లే విశాఖ ఇంతలా అభివృద్ధి చెందిందని వివరించారు. లక్షలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు దక్కాయని తెలిపారు. దీక్షల్లో నాయకులు ఆనందరావు, భీమారావు, రాంబాబు పాల్గొన్నారు.

రేవంత్ రెడ్డి నేడు విజయవాడ రాక

ప్రజాశక్తి- అమరావతి బ్యూరో

తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాణిక్యం ఠాగూర్ సోమవారం విజయవాడకు రానున్నారు. ఈ మేరకు సిడబ్ల్యుసి మెంబరు గిడుగు రుద్రరాజు, కార్యనిర్వాహక అధ్యక్షులు షేక్ మస్తాన్ వళి ఆదివారం మీడియాకు వెల్లడించారు. మాజీ సిఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 75వ జయంతి సందర్భంగా పిసిసి రాష్ట్ర కమిటీ ఆధ్వర్యాన సభ నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. సోమవారం సాయంత్రం 4 గంటలకు మంగళగిరి సికె కన్వెన్షన్‌లో సభ ఉంటుందన్నారు.

హోదా కోసం పోరాటం

- ప్రమాదకరమైన బిజెపిని బాబు రాష్ట్రానికి రప్పించారు
- సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి



రాష్ట్రానికి ప్రత్యేక హోదా కోసం పోరాడుతామని సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ తెలిపారు. అనంతపురంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో ఆయన ఆదివారం మీడియా సమావేశంలో మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోడీ వ్యవహారం చింతచచ్చినా పులుపు చావలేదన్న చందంగా ఉందని వ్యాఖ్యానించారు. 400 సీట్లు వస్తాయని మోడీ ప్రగల్భాలు పలికారని, 2019లో వచ్చిన సీట్ల కంటే తక్కువ వచ్చాయని గుర్తు చేశారు. చంద్రబాబు, నితీష్‌ల మద్దతుతో అధికారం చేపట్టారన్నారు. ప్రమాదకరమైన బిజెపిని చంద్రబాబు నాయుడు రెండోసారి రాష్ట్రానికి ఆహ్వానించారని వివరించారు. విభజన సమస్యలపై ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ముఖ్యమంత్రులు కలిసి చర్చించుకోవడాన్ని ఆహ్వానిస్తున్నామని తెలిపారు. రెండు రాష్ట్రాల మధ్య ఇచ్చుపుచ్చుకునే ధోరణి ఉండాలని సూచించారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ.. గత ఐదేళ్లలో జగన్‌మోహన్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వంపై రాష్ట్రానికి ప్రత్యేక హోదా, నిధుల కోసం ఒత్తిడి చేయలేదని విమర్శించారు. రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని సిఎం చంద్రబాబు కేంద్రంపై ఒత్తిడి పెంచాలని డిమాండ్ చేశారు. జగన్‌ను ఓడించాలని ప్రజలు కూటమికి ఓటు వేశారేగానీ, బిజెపి, జనసేన, టిడిపి పొత్తువల్ల కాదని తెలిపారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

- మంత్రి సత్యప్రసాద్‌కు వ్యవసాయ కార్మిక సంఘం వినతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఇచ్చిన హామీ మేరకు తక్షణమే వ్యవసాయ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దడాల సుబ్బారావు, వి వెంకటేశ్వర్లు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను వ్యవసాయ కార్మిక సంఘం నేతలు ఆదివారం కలిసి వినతిపత్రం సమర్పించారు. సంక్షేమ బోర్డు హామీ అమలైతే రాష్ట్రంలోని 50 లక్షల మంది వ్యవసాయ కార్మికులకు ఆర్థిక, సామాజిక ప్రయోజనాలు నెరవేరుతాయని తెలిపారు. వ్యవసాయ కార్మికులకు కార్మిక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసింది కేరళ రాష్ట్రం మాత్రమేనన్నారు. సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరుతూ ఈ నెల 10న ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన విజయవాడలోని మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రజా సంఘాలు, మేధావులతో చర్చా వేదిక ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పుంగనూరులో ఇండోర్ స్టేడియం నేలమట్టం

- ప్రతీకార చర్యలా? అక్రమ కట్టడాలని కూల్చేశారా?

ప్రజాశక్తి- పుంగనూరు (చిత్తూరు జిల్లా)

చిత్తూరు జిల్లా పుంగనూరు పట్టణంలో ఏళ్ల తరబడి ఉన్న ఇండోర్ స్టేడియంను శనివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు రెండు హిటాచీలతో నేలమట్టం చేశారు. ఎంపిటి రోడ్డు జాతీయ రహదారి పక్కలో ఉన్న ఇండోర్ స్టేడియం గత 30 ఏళ్లగా పట్టణంలో ఉన్న అన్నివర్గాల వారు ఉపయోగించుకుంటున్నారు. ఈ ఇండోర్ స్టేడియంలో షటిల్, స్నూకర్స్, క్యారమ్స్, చెస్ లాంటి క్రీడలకు వినియోగించుకుంటున్నారు. ఉన్నఫలంగా ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా షటిల్ కోర్టును నేలమట్టం చేయడంతో పట్టణంలో ఈ వార్త దావనంలో అల్లుకుంది. ప్రతీకార చర్యలో భాగంగా జరిగిందా! లేక అక్రమ కట్టడాలని ప్రభుత్వ అధికారులు ఏమైనా కూలదోసారా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అర్ధరాత్రిలో జరిగిన ఈ విధ్వంసకర సంఘటనను పట్టణ ప్రజలు, క్రీడాకారులు ముక్తకంఠంతో ఖండిస్తున్నారు. సుమారు ఈ స్టేడియంలో 150 మంది దాకా షిఫ్ట్ పద్ధతిలో షటిల్ ఆడేవారు. పోలీసులు, వైద్యులు, న్యాయవాదులు, ప్రభుత్వ ఉద్యోగులు ఉదయం సాయంత్రం వేళల్లో ఈ షటిల్ కోర్టుకు వెళ్లేవారు. టికెటి స్థలంలో 30 ఏళ్ల క్రితం ఏడు గుంటలు జాగాలో (7623 చదరపు అడుగులు) అప్పటి ప్రభుత్వ అధికారులు అనుమతితో షటిల్ కోర్టుగా ఏర్పాటు చేసుకుని ఆటలకు ఉపయోగిస్తున్నారు. ఆ తర్వాత సుమారు రూ.80 లక్షలు ఖర్చుచేసి ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేసుకున్నారు. పిల్లలకు ఉచిత శిక్షణ కూడా ఇండోర్ స్టేడియంలో ఇచ్చేవారు.



నేలమట్టమైన పుంగనూరు ఇండోర్ స్టేడియం

షటిల్ ఫ్రెండ్స్ అసోసియేషన్ అని ఏర్పాటు చేసుకొని దీని ద్వారా కార్యక్రమాలు నిర్వహించేవారు. ఇండోర్ స్టేడియం నేలమట్టం చేయడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాజకీయపరంగా ఏమైనా చేశారా, లేక షటిల్ కోర్టు ఉన్న స్థలం డికెటి కావడంతో దాని వెనుక వైపు ఉన్న స్థల యజమాని ఏమైనా చేశారా అని పలువురు అనుమానాలు వ్యక్తపరుస్తున్నారు. ఈ సంఘటనపై పోలీసులకు ఫ్రెండ్స్ సెటిల్ అసోసియేషన్ అధ్యక్షులు, ప్రముఖ దంత వైద్యనిపుణులు డాక్టర్ శరన్ కుమార్ ఫిర్యాదు చేశారు.

పేదలపై కక్షసాధింపుతో వ్యవహరించిన వైసిపి ప్రభుత్వం : నిమ్మల

ప్రజాశక్తి - పాలకొల్లు: పేద మహిళలపై కక్ష సాధింపుగానే వైసిపి ప్రభుత్వం టిడ్కో ఇళ్లను నిర్లక్ష్యం చేసిందని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు విమర్శించారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులోని టిడ్కో ఇళ్ల సముదాయంలో టిడిపి శ్రేణులతో కలిసి ఆయన ఆదివారం శ్రమదానం చేశారు. వర్షం, బురదగా ఉన్నా మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహనరావుతో కలిసి స్వయంగా పార, గునపం పట్టి పనులు సాగించారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల మీడియాతో మాట్లాడారు. గత టిడిపి ప్రభుత్వ హయాంలో టిడ్కో ఇళ్ల నిర్మాణ పనులు 90 శాతం పూర్తి చేస్తే వైసిపి ప్రభుత్వం ఐదేళ్లలో అరబస్తా సిమెంటు, రూపాయి పనీ చేయలేదని విమర్శించారు.

ధైర్యంగా ఎదుర్కొందాం : జగన్

ప్రజాశక్తి-పులివెందుల టౌన్ (వైఎస్ఆర్ జిల్లా)

ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎంత దూరమైనా వెళ్దామని, కలిసి కట్టుగా ముందుకెళ్లి సమస్యలను పరిష్కరించుకుందామని మాజీ సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. వైఎస్ఆర్ జిల్లా పర్యటనలో ఉన్న ఆయన ఆదివారం సొంత నియోజకవర్గమైన పులివెందులలోని తన క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా అందరిని పేరుపేరునా పలకరించి కష్టసుఖాలను అడిగి తెలుసుకున్నారు. ఉమ్మడి జిల్లాలోని ప్రజలు, నాయకులు, కార్యకర్తలు తమ సమస్యలు విన్నవించుకున్నారు. కొందరు వినతి పత్రాలు అందజేశారు. భారీ సంఖ్యలో కార్యకర్తలు, అభిమానులు తరలి వచ్చారు. తమకు టిడిపి నేతల నుంచి ఇబ్బందులు ఎదురవుతున్నాయని వైసిపి కార్యకర్తలు జగన్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలు, నాయకులు ఎవరూ అధైర్యపడొద్దని, కష్టాలను ధైర్యంగా ఎదుర్కొందామని తెలిపారు. రాబోవు రోజుల్లో ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. సమస్యలను చెప్పుకోవడానికి వచ్చిన ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరిస్తూ.. మళ్లీ మంచి రోజులు వస్తాయి, వేచి చూద్దామని, టిడిపి నాయకుల దాడులపై న్యాయ పోరాటం చేద్దామని అన్నారు. వైసిపి నాయకులకు, కార్యకర్తలకు అండగా ఉండేందుకు కమిటీని వేస్తామని, ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంటూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం పులివెందులలో పాముకాటుకు గురై మరణించిన బాలిక కుటుంబాన్ని పరామర్శించారు. చిన్నారికి నివాళులర్పించారు. కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. లింగాల మండలం పెద్దకూడాలలో మాజీ మండల అధ్యక్షులు వెంకటసుబ్బారెడ్డి సతీమణి లక్ష్మినరసమ్మ అనారోగ్యంతో మృతి చెందడంతో ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆమె చిత్ర పటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కడప ఎంపి వైఎస్ అవినాష్‌రెడ్డి, నియోజకవర్గంలోని ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రజా సమస్యలు వింటున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

చంద్రబాబు ఇంటికి ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ పిఎస్ఆర్ ఆంజనేయులు

- అపాయింట్‌మెంట్ లేదని వెనక్కి పంపిన సెక్యూరిటీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిఎం చంద్రబాబును కలిసేందుకు సీనియర్ ఐపిఎస్, ఆంధ్రప్రదేశ్ ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ పి సీతారామాంజనేయులు ఆదివారం ప్రయత్నించారు. అపాయింట్‌మెంట్ లేకపోవడంతో సెక్యూరిటీ అధికారులు ఆయన్ను లోపలికి అనుమతించలేదు. గత ప్రభుత్వంలో ఇంటెలిజెన్స్ చీఫ్‌గా కీలక బాధ్యతలు నిర్వహించిన పిఎస్ఆర్ ఆంజనేయులు, విజయవాడ సిపి కాంతిరాణ టాటాలపై ఎన్నికలకు ముందు ఇసి వేటు వేసింది.

చంద్రబాబు సిఎంగా బాధ్యతలు చేపట్టి నెల రోజులు కావస్తున్నా ఇప్పటివరకు సీతారామాంజనేయులుకు పోస్టింగ్ ఇవ్వలేదు. దీంతో చంద్రబాబును కలిసేందుకు ఆదివారం అపాయింట్‌మెంట్ ఇప్పించాలని ఆయన శనివారం సిఎంఒ అధికారులను కోరారు. సిఎం బిజీ షెడ్యూల్ వల్ల హైదరాబాద్‌లో వీలుకాదని అధికారులు ఆయనకు చెప్పారు. అయినా, ముఖ్యమంత్రిని కలిసేందుకు ఆదివారం ఆయన రెండు సార్లు జూబ్లీహిల్స్‌లోని చంద్రబాబు ఇంటికి వచ్చారు. అపాయింట్‌మెంట్ లేదని భద్రతా సిబ్బంది చెప్పినా ఆయన అరగంట సేపు అక్కడే వుండి వెళ్లిపోయారు.

రామోజీరావు యువతకు ఆదర్శం

- సంస్మరణ సభలో పలువురు వక్తలు

ప్రజాశక్తి - గుంటూరు

సామాన్య కుటుంబంలో పుట్టి నిబద్ధత, దఢసంకల్పం, క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలకు చేరుకున్న రామోజీరావు జీవితాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జనచైతన్య వేదిక, ఠాగూర్ మెమోరియల్ థియేటర్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం రామోజీరావు సంస్మరణ సభ నిర్వహించారు. జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వి.లక్ష్మణరెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో నర్సరావుపేట ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ.. రామోజీరావు ఎంత ఎత్తుకు ఎదిగినా విలువలను కోల్పోకుండా చివరి వరకూ నిలబడ్డారని, ఏ రంగంలో అడుగుపెట్టినా అది సమాజానికి ఉపయోగపడేలా కృషి చేశారని కొనియాడారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ తెలుగు భాష కోసం అహర్నిశలు పాటుపడ్డారని, జర్నలిజం కళాశాల స్థాపించి వేలాది మందిని తీర్చిదిద్దారని తెలిపారు. ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ రామోజీరావు ప్రజాస్వామ్యాన్ని గట్టిగా నమ్మారని, ప్రజాస్వామ్యానికి ముప్పు వాటిల్లినప్పుడల్లా ముఖ్యపాత్ర పోషించారని అన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రజలే చరిత్ర నిర్మాతలని రామోజీరావు నమ్మారని, ఆయన ఏ అంశమైనా ప్రజల కోణంలోనే ఆలోచించే వారని తెలిపారు. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ నమ్మిన విశ్వాసాలను చివరి వరకూ సుదీర్ఘకాలం నిలబెట్టుకోవడం గొప్ప విషయమన్నారు. కాంగ్రెస్ మీడియా కమిటీ చైర్మన్ తులసిరెడ్డి మాట్లాడుతూ చరిత్ర గుర్తుంచుకునే అతికొద్ది మందిలో రామోజీరావు ఒకరని కొనియాడారు. ఈనాడు ఎడిటర్ ఎం.నాగేశ్వరరావు మాట్లాడుతూ క్రమశిక్షణ, ధైర్యసాహసాలు, విశ్వసనీయతకు రామోజీరావు మారుపేరని, ఈ లక్షణాలే ఆయన ఉన్నతికి దోహదం చేశాయని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు మహమ్మద్ నసీర్ అహ్మద్, గళ్లా మాధవి, రిటైర్డ్ ఐఎఎస్ అధికారి డాక్టర్ పి.కృష్ణయ్య, బిజెపి రాష్ట్ర మీడియా ఇన్‌ఛార్జి పాతూరి నాగభూషణం, మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్, హైకోర్టు న్యాయవాది పి.రవితేజ ప్రసంగించారు. తొలుత రామోజీరావు చిత్రపటానికి అతిథులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు.



రామోజీరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అతిథులు

కిడ్నీ ఆస్పత్రిలో శాశ్వత వైద్యులేరి ?

- ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక కన్వీనర్ అజశర్మ

ప్రజాశక్తి- పలాస, శ్రీకాకుళం జిల్లా



కిడ్నీ రోగులతో మాట్లాడుతున్న అజశర్మ

కిడ్నీ ఆస్పత్రిలో శాశ్వత వైద్యులను, సిబ్బందిని నియమించి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక కన్వీనర్ అజశర్మ ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. శ్రీకాకుళం జిల్లా పలాస కాశీబుగ్గలోని కిడ్నీ పరిశోధన కేంద్రం, 200 పడకల ఆస్పత్రిని ఆదివారం ఆయన పరిశీలించారు. ఆస్పత్రిలోని సమస్యలపై వైద్యులను, రోగులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో అజశర్మ మాట్లాడుతూ కిడ్నీ ఆస్పత్రి నిర్మాణం పూర్తి చేసేరే కానీ, ఇంకా చాలా సేవలు ప్రజలకు అందుబాటులోకి రాలేదని పేర్కొన్నారు. ఎక్స్ రే మిషన్ ఉన్నా... టెక్నీషియన్ లేకపోవడంతో నిరుపయోగంగా పడి ఉందన్నారు. కార్డియాలజిస్టు, కేన్సర్ స్పెషలిస్టులు లేకపోవడంతో ఆ వ్యాధిగ్రస్తులకు సేవలు అందడం లేదన్నారు. 33 మంది స్పెషలిస్ట్ డాక్టర్లు, 65 మంది నర్సింగ్ సిబ్బంది, ఎనిమిది మంది రీసెర్చ్ సిబ్బంది, 18 మంది టెక్నీషియన్లు, 45 మంది ఇతర సిబ్బందిని నియమించాల్సి ఉందని వివరించారు. కానీ, ఆ స్థాయిలో డాక్టర్లు, సిబ్బందిని ప్రభుత్వం నియమించలేకపోయిందన్నారు. కేవలం డాక్టర్లు 17 మంది మాత్రమే ఉన్నారని చెప్పారు. కిడ్నీ వ్యాధిపై పరిశోధన సంతృప్తికరంగా జరగడంలేదన్నారు. ప్రభుత్వం జిఒ నంబరు 102కు అనుగుణంగా శాశ్వత స్థాయిలో సిబ్బందిని నియమించాలని కోరారు. నర్సింగ్ సిబ్బంది అంతా కాంట్రాక్టు పద్ధతిలోనే ఉన్నారని, ఇతర సిబ్బందీ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్‌లోనే కొనసాగుతున్నారని చెప్పారు. సిబ్బందికి సకాలంలో జీతాలు చెల్లించాలని కోరారు. ఉద్దానం కిడ్నీ వ్యాధికి కారణాలను పరిశోధించే రీసెర్చి నిపునులను వెంటనే నియమించి, దేశ, అంతర్జాతీయ నిపుణుల సహకారంతో సరైన నిర్ధారణలకు వచ్చి కిడ్నీ వ్యాధి నుంచి పూర్తి విముక్తి కలిగించాలని కోరారు.

వాలీబాల్ ఆడుతూ రాక్ కార్మికుల నిరసన

ప్రజాశక్తి - సామర్లకోట(కాకినాడ జిల్లా)

తమను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కాకినాడ జిల్లా సామర్లకోట ఎడిబి రోడ్డులోని రాక్ సిరామిక్స్ పరిశ్రమ ఎదుట కార్మికులు వాలీబాల్ ఆడుతూ నిరసన తెలిపారు. కార్మికులకు తక్షణమే న్యాయం చేయాలని, అక్రమ తొలగింపులను నిలిపేయాలని, తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవాలని ప్లకార్డులను ప్రదర్శించారు. సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు చేపట్టిన నిరసన ఆదివారం నాటికి 83వ రోజుకు చేరుకుంది. కార్మికులకు ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ పెద్దాపురం ప్రాజెక్టు కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు దాడి బేబి, ఎస్తేరు రాణి, నాయకులు నాగమణి, దేవి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎటువంటి నోటీసులూ ఇవ్వకుండా కార్మికులను తొలగించడం అన్యాయమన్నారు. పరిశ్రమ యజమానులు కార్మిక చట్టాలను తుంగలో తొక్కుతుంటే కార్మిక శాఖ అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. కార్మికుల మద్దతుగా అంగన్‌వాడీలను సమీకరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి డి.క్రాంతికుమార్, కార్మికులు చంద్రశేఖర్, గంగాధర్, సతీష్, రామకృష్ణ, వరప్రసాద్, మల్లికార్జునరావు, గంగాధర్, క్రాంతి, మంగారావు, అర్జున్‌రావు పాల్గొన్నారు.



రాక్ సిరామిక్స్ పరిశ్రమ గేటు ఎదుట వాలీబాల్ ఆడుతూ నిరసన తెలుపుతున్న కార్మికులు



భాష చారిత్రిక గమనంలో పుడుతుంది, నిర్దిష్ట రూపంలో పరిపుష్టమవుతుంది. అంచేతనే అది ఏ పునాది కన్నా, కట్టడం కన్నా కూడా ఎక్కువ కాలం మనుగడలో ఉంటుంది.

- స్టాలిన్

యథా రాజా.. తథా బాబా..

హఠాత్తుగా పుడమి తనువు
ప్రకంపించలేదు
ఉన్నట్టుండి తుపాను జ్వాలలు ఎగసి పడలేదు
నిప్పుల వరద కూడా పోటెత్తలేదు
భారీ ఎన్‌కౌంటర్ ప్రళయ గర్జన చేయలేదు

మరి ఈ శవాల గుట్టలు..?
చెబితే సిగ్గు చేటు
చిటికెడు పాద ధూళి కోసం
చెలరేగిన మూర్ఖ పోరాటానికి
పుట్టిన సామూహిక చావులు
స్వయం ప్రకటిత లోకనాథుడు
రాసిన మృత్యు కథాచిత్రాలు

స్వీయ యుక్తిని విస్మరించి
అతీంద్రియ శక్తికి దాసోహమైతే
ఎందెందు వెదకినా అందందు
అవివేక భస్మం ..!

గుప్పెడు ఓట్ల కోసం పడిన కక్కుర్తి
అజ్ఞానమూర్తులతో అంట కాగితే
బజారు కో బాబా
వీధికో ఫాదర్
పేటకో మౌజన్ ప్రత్యక్షం!
అవిద్యారణ్యంలో కూరుకుపోయిన
లక్షలాది బతుకులను బ్లాక్ మెయిల్ చేసి
మూఢ విశ్వాసాన్ని సొమ్ము చేసుకోవడమే
అధునాతన వ్యాపారం..
పెట్టుబడి శూన్యం .. రాబడి అనంతం!

ఆటంబాంబు కంటే
గుడ్డి నమ్మకం అత్యంత ప్రమాదకరం
యుద్ధం కంటే మౌఢ్యమే మహా నష్టదాయకం
నేరం భక్తులదే కాదు
బరితెగించిన బాబాది
యథా రాజా.. తథా బాబా ..

- కోయి కోటేశ్వర రావు
94404 80274

నెత్తురోడుతున్న నేల మీద

ఆక్రోశాలు మిన్నంటిన చోట
ఆలోచనలు విరమించిన చోట
దాడులు నిత్య కృత్యాలవుతున్నాయి
మనిషిని మనిషిగా చూడాల్సిన చోట
విధ్వంసం విలయతాండవం చేస్తోంది
కక్షలు సమస్యకి పరిష్కారం కావు
నీ పగ విన్యాసం కన్నా
ప్రగతిగీతమే ఘనమైనది!
నువ్వు కూలదోస్తావ్
రేపు వాళ్ళు పునః నిర్మాణం చేస్తారా?

ప్రజల కోసం నిర్మాణాలు జరగాలి
విధ్వంసాలు కాదు
విదుర నీతి పాఠాలు వినిపించటం కాదు
నిజ ధర్మ ఆచరణ చూపించాలి

నెత్తురోడుతున్న నేల మీద
శిశుపాలుని పాపాలు పండే కాలానికి
రావణ కాష్టం రాక్షస రాజ్యం
నిద్దుర లేకుండా మనిషిని బాధిస్తోంది

ప్రేమకు తలలు వంచిన చోట
విద్యుక్త ధర్మం పరిఢవిల్లిన చోట
వరాల వెలుగు కోసం
కోట్ల కళ్ళు దిక్కులు చూస్తున్నాయి
మంచిని పెంచి మరో తరానికి
ఆదర్శ పాఠాలుగా
ఒకరికొకరు చేయూత అవుదాం!

- గవిడి శ్రీనివాస్
70192 78368

ఎన్నికల కాలమ్!

తనను నాయకుడిగా ఎన్నుకుంటే
ఖరీదైన, అందమైన 'రంగురంగుల
గొడుగులిస్తా'నని
పక్షులకు వాగ్దానం చేస్తుంది రాబందు!
'ఎప్పుడూ ఈ చెట్లేనా, ఎన్నాళ్ళైనా ఇవే గూళ్ళా?
మార్పు రావాలి' అని పక్షులు రంగు గొడుగులకు
ఆశపడి
చెట్లనీ, చెట్లకొమ్మల్లో కట్టుకున్న గూళ్ళనీ నిర్లక్ష్యం
చేస్తాయి

ఎన్నికలు ముగుస్తాయి!
'తుపాను గాలులకు ఎగిరిపోయే గొడుగులు వథా
పథకం రద్దు చేయబడినది" అని ప్రకటన
విడుదలౌతుంది!
కేటలబార్‌లు, వడిసెలలు అలంకరిస్తాయి
వేటగాళ్ళ చేతుల్ని.

***

తనను నేతగా ఎంచుకుంటే
'ఒక్కో చేపకు ఒక్కో అద్భుతమైన ఆకర్షణీయమైన
'ఆక్వేరియం' మంజూరు చేస్తానని హామీ ఇస్తుంది
సొరచేప!
ఎప్పుడూ ఇవే నీళ్ళా, నిత్యమూ ఇదే బురదా?
అని చేపలు చెరువుల్ని అసహ్యించుకుంటాయి

ఎంపిక జరిగేక
'చెరువుల్ని మొసళ్ళు ఆక్రమించినట్టు
వార్తలొస్తాయి'
వలలూ, గేలాపు రివ్వలూ
ఎదురొస్తాయి మత్స్యబృందాలకి!
పక్షులకు తోటలుండవు
చేపలకు చెరువులుండవు
తోటల్లోనూ, చెరువుల్లోనూ
కాంక్రీటు మహావృక్షాలు మొలుచుకొస్తాయి
ఎక్కడెక్కడికో ఎగిరి చెట్టుకొమ్మల్ని
వెదుక్కోక తప్పదు పక్షులకి ...
ఏ మారుమూల గుమ్మల్లోనో,
బురదనీటి గుంటల్లోనో
తలదాచుకోవాల్సివస్తుంది చేపలకి ...

మార్పు అనివార్యమనీ,
ఆహ్వానించాల్సిందేననీ
తీర్పులిస్తాయి ఉభయచర భజన బృందాలు...

- లాంగుల్య

చరిత్రకు అద్దం 'చెదిరిన పాదముద్రలు'

పుస్తకం

ఉణుదుర్తి సుధాకర్ నవల 'చెదిరిన పాదముద్రలు' చారిత్రిక స్పృహ ఉన్న పాఠకులను ఇట్టే పట్టేసి ఆసాంతమూ చదివిస్తుంది. అదే చదివే అభిరుచి ఉన్న కొత్త తరం పాఠకులనైతే వారికి ఇంతవరకూ తెలియని, లేదా తెలుసుకోలేకపోయిన ఒక కొత్త (పాత) ప్రపంచపు సమాజంలోకి అమాంతం తీసుకు పోతుంది.

ఈ నవల ఇతివృత్తం 1930-1960 మధ్య కాలం నాటిది. ఇదొక చారిత్రిక నవల. మహాకవి శ్రీశ్రీ పద ప్రయోగం 'పుడమి తల్లికి పురుటి నొప్పులు' మనందరికీ తెలుసు. ఆ పురుటి నొప్పుల్ని వర్ణించడం అందరికీ సాధ్యమూ కాదు, అందరూ ఆ సాహసమూ చేయరు. కాని, సుధాకర్ ఆ సాహసం చేశారు. ఎన్నో ఆశలతో కళింగాంధ్ర ప్రాంతం నుంచి బర్మా ప్రాంతానికి వలస పోయి, అక్కడ ఆశించినవి దక్కేలోపుగానే, తమ ప్రమేయం లేని కొన్ని శక్తుల సంఘర్షణ ఫలితంగా అన్నీ పోగొట్టుకుని కాందిశీకులై వెనుదిరిగి వచ్చిన ఒక జంట చుట్టూ అల్లిన చారిత్రిక ఘటనల కథనం ఈ నవల. నవలా కాలపు చరిత్రను బ్రిటిష్ పాలకులు తమకు అనుకూలంగా ఉండేలా వక్రీకరిస్తే, ఆ తర్వాత పాలకులైన కాంగ్రెస్ వారు తమవైన వక్రీకరణలను జోడించారు. వాటికి భిన్నంగా రచయిత 'చరిత్ర నిర్మాతలు ప్రజలు' అన్న స్పృహ కలిగివున్నవాడవడం చేత- వాస్తవ చారిత్రిక ఘటనలనే తన కథనంలోకి ఇముడ్చుకున్నాడు. ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా అంతిమంగా చరిత్ర ఎప్పుడూ ముందుకే పోతుంది అన్న ఆశావహ దృక్పథాన్ని తను సృష్టించిన పాత్రల ద్వారా వ్యక్తం చేయగలిగాడు.

1930-60 కాలం నాటి చారిత్రిక పరిణామాలన్నింటినీ స్పృశించే విధంగా నవల రాయాలంటే అది టాల్‌స్టాయ్ 'యుద్ధము-శాంతి' మాదిరి చాలా పెద్ద గ్రంథమే అవుతుంది. బహుశా అందుకే రచయిత తన రచనను బర్మా, బెంగాల్ చుట్టూ అల్లారు. 1950 - 60 మధ్య కాలంలో పుట్టిన నాబోటోళ్లకు 'బరమావోళ్లు' అని పిలవబడే తెలుగువాళ్ల గురించి తెలుసు. కానీ, వాళ్లు కాందిశీకులెందుకయ్యారో, చివరికి స్వస్థలమైన కళింగాంధ్రలో ఏమీ లేనివాళ్లుగా జీవితాలను మళ్లీ ఎందుకు కొనసాగించాల్సి వచ్చిందో పూర్తి వివరాలు తెలియవు. ఈ నవలలో కళింగాంధ్ర ప్రాంతం నుంచి బర్మాకు వలసలు పోయి, రెండో ప్రపంచ యుద్ధకాలంలో వెనక్కి కాందిశీకులుగా ఎందుకు రావాల్సి వచ్చిందో చిత్రించారు.

విదేశాల్లో ఉద్యోగాలు చేయడం అనేది ఇప్పటి యువతకు ఒక గొప్ప అవకాశంగా అనిపిస్తోంది. కాని ఆ అవకాశాల వెనుక ఎంత అభద్రత పొంచివుంటుందో ఈ నవల చదివితే తెలుస్తుంది. కాలం, ప్రదేశం మారవచ్చు. కష్టపడి బతికేవాడికి ఏ దేశం అయితే ఏమిటి అని సులువుగా చెప్పేయవచ్చు. కాని మనుగడ కోసం పుట్టి పెరిగిన ఊరిని, దేశాన్ని వదిలి వేరే దేశానికి పోయాక, అక్కడ పాలకులు వారి అవసరం ఉన్నంతకాలమే మనల్ని అక్కడ ఉండనిస్తారని, ఆ తర్వాత మనల్ని నిర్దాక్షిణ్యంగా నట్టేట విడిచిపెడతారని 'చెదరిన పాదముద్రలు' నవల మనకి గుర్తు చేస్తుంది. నేడు



ప్రపంచవ్యాప్తంగా విస్తరించిన వలస కార్మికుల పరిస్థితులను అవగతం చేసుకోడానికి, వారి ఆవేదనలను అర్థం చేసుకోడానికి ఈ రచన తోడ్పడుతుంది.

భారత జాతీయోద్యమం బ్రిటిష్ వలస పాలకుల పైకి ఎక్కుపెట్టి సాగుతున్న కాలంలోనే 1939 తర్వాత ప్రపంచానికి హిట్లర్, అక్షరాజ్య కూటమి నుంచి (జర్మనీ, జపాన్, ఇటలీ) ఫాసిజం రూపంలో అతి పెద్ద ప్రమాదం ముంచుకొచ్చింది. ఆ ప్రమాదం పట్ల చర్చిల్‌తో సహా కొమ్ములు తిరిగిన రాజనీతిజ్ఞులందరూ అలసత్వాన్ని ప్రదర్శించారు. చివరికి ఆ ఫాసిస్టు కార్చిచ్చు తమ తమ దేశాల పైకే ఎదురు తిరిగినప్పుడు కాని వాళ్ళకి తెలిసిరాలేదు. చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్టు- అప్పుడు బ్రిటన్, ఫ్రాన్స్ సోవియట్ యూనియన్‌తో సహకరించడానికి ఒప్పుకోవలసి వచ్చింది. కాని ఫాసిజం ప్రమాదాన్ని ముందునుంచీ గుర్తించిన యూరోపియన్ కార్మికవర్గం ఆ శక్తులను ప్రతిఘటించడానికి పూనుకుంది. వారికి మొనగాడుగా సోవియట్ యూనియన్ నిలిచింది. ఈ దశలో అక్షరాజ్య కూటమి ఫాసిజాన్నా? లేక బ్రిటీషు ప్రభుత్వాన్నా? దేనిని ప్రధానంగా మన పోరాట లక్ష్యంగా చేసుకోవాలి? అన్నది భారతదేశంలో స్వాతంత్ర్యోద్యమం ముందు తలెత్తిన చిక్కు ప్రశ్న. కాంగ్రెస్ పార్టీ బ్రిటిష్ వారినే తన లక్ష్యంగా తీసుకొంది. కానీ, కమ్యూనిస్టులు ప్రపంచానికే పెనుముప్పు అయిన ఫాసిస్టు ప్రమాదాన్నే ప్రధాన లక్ష్యంగా చేసుకున్నారు. ఫాసిజం ఓడిపోయింది కనుక వలసవాదం బలహీనపడింది. దాని పర్యావసానంగా జాతీయోద్యమం ఉవ్వెత్తున ఎగసింది.

నావికాదళ తిరుగుబాటు, దానికి బాసటగా కార్మికవర్గ సమ్మెలు, తెలంగాణా తదితర సంస్థానాల్లో రైతుల సాయుధ ప్రతిఘటనలు వెల్లువెత్తాయి. వాటన్నింటి తాకిడి తట్టుకోలేక బ్రిటిష్ పాలకులు మనకి స్వాతంత్ర్యం ప్రకటించారు.

కాని, చరిత్ర తాలూకు ఈ కోణాన్ని మన పాఠ్యాంశాల్లో మనం చూడం. స్వాతంత్ర్యం సాధించి పెట్టినది గాంధీ లేదా కాంగ్రెస్ పార్టీ అని ఆ పుస్తకాలు చిత్రించాయి. (ఇప్పుడు మోడీ ప్రభుత్వమైతే మనకి 2014 దాకా స్వాతంత్ర్యం రానేలేదని అంటోంది. అది వేరే సంగతి) కానీ, ఆ కాలంలో ప్రజలు ఏ పాత్ర పోషించారో, ఎన్ని అవస్థలు పడ్డాలో, ఆ కష్టాల్లో వారికి కమ్యూనిస్టులు అండగా ఎలా నిలిచారో తెలుసుకోడానికి ఈ నవల తోడ్పడుతుంది. రచనకి సాధికారత కల్పించేవిధంగా ఆనాటి బర్మా దేశపటాన్నీ, చారిత్రిక ఘటనల క్రమాన్నీ ముందు తెలియజేయడం బాగుంది.

ఆ తర్వాత దేశ విభజన పర్యవసానాలు బెంగాల్‌లో అన్నదమ్ముల్లా మెలిగిన హిందూ - ముస్లింల మధ్య ఎడబాటుకు దారి తీసిన వైనాన్ని, కరువు గాని, యుద్ధంగాని వచ్చిపడినప్పుడు వలస పాలకులు ఎంత క్రూరంగా వ్యవహరిస్తారో ఆ ధోరణుల్ని నవల మన ముందుంచుతుంది. అందుకు పూర్తి భిన్నంగా కమ్యూనిస్టులు ప్రజలతో మమేకమై ఏవిధంగా పనిచేశారో రచయిత వివరించారు.

చరిత్రలో సంఘటనలకి ఉండే ప్రాముఖ్యత వ్యక్తులకు ఇవ్వరు. ఆ వ్యక్తులందరూ కలిస్తేనే చరిత్ర రూపొందుతుంది అన్నది గతకాలపు చరిత్రకారుల్లో అత్యధికులు విస్మరించారు. 'చెదరిన పాదముద్రలు' అందుకు పూర్తి భిన్నంగా వ్యక్తులనే ప్రధానంగా ఎంచుకుంది. వారి అనుభవాలను, అనుభూతులను, సున్నితమైన భావావేశాలను చిత్రించిన తీరు పాఠకుల గుండెలను స్పృశిస్తుంది. కళ్ళను చెమర్చుతుంది. ముఖ్యంగా మూగ చిత్రకారుడు అన్న అధ్యాయంలో 'పక్షుల రెక్కలకు రంగులద్దితే అవి ఎగిరిపోతాయి' అని ఒక అంధురాలి చేత చెప్పించటం; వేడిగా, చల్లగా, చిక్కగా, మెత్తగా, గరుకుగా ఉంటాయని ఆమె చేత వివరణ ఇప్పించటం చాలా హృద్యంగా ఉంది. విభిన్న ప్రతిభావంతుల లోకం, వారి స్పందనలు ఎంత గొప్పగా, విశిష్టంగా ఉంటాయో; అన్ని అవయవాలూ సవ్యంగా ఉన్నవాళ్లకి అవి మామూలుగా ఎందుకు అందనంత ఎత్తులో ఉంటాయో రచయిత చెప్పకనే చెప్పాడు.

ఈ నవల అమెరికన్ తెలుగు అసోసియేషన్ (ఆటా) పోటీలో బహుమతి పొందింది. ఇటువంటి రచనలకి బహుమతులు ఇవ్వడానికి కేవలం సాహిత్యాభి రుచి ఒక్కటే చాలదు. మానవత్వం, విశాల దృష్టి కూడా పుష్కలంగా ఉండాలి. అందుచేత రచయితతోబాటు ఆటా వారికి కూడా అభినందనలు తెలియజేయాలి. 167 పేజీల ఈ నవల అచ్చు ప్రతి వెల రు.300. నవోదయ, తెలుగు బుక్స్ వెబ్‌సైట్‌లో దొరుకుతుంది.

- ఎంవిఎస్ శర్మ

చెప్పాలనుకున్నది చెప్పకపోతే
గతంగానే మిగిలిపోతాం

సంభాషణ



రమేష్ కార్తీక్ నాయక్ యువ రచయిత. తెలుగు ఆంగ్ల భాషల్లో కథలు, వచన కవిత్వం, అనువాదం వంటి ప్రక్రియల్లో సాహిత్య సష్టి చేశాడు. 2024 సంవత్సరానికిగాను కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారం అందుకున్న సందర్భంగా సంభాషణ టూకీగా...

ఈ సంవత్సరం కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారానికి ఎంపికవడం పట్ల మీ అనుభూతి?

అందరిలానే నేను ఆనందంగానే ఉన్నాను. కాని నాకున్న ఆనందానికి కారణం వేరు. అవార్డు రావడం వల్ల తెలుగులో లేదా ఇతర భాషలో సంచార, గిరిజన, ఆదివాసీల సాహిత్య వాటా ఎంత ఉందో కొందరైనా అన్వేషించడం మొదలు పెడతారు. అన్వేషణలో ఇప్పటిదాకా మనకు తెలియనివాళ్ల సాహిత్యం కూడా బయటపడవచ్చు. జాలితోనో, లేదంటే మా వాళ్ల గురించి సాహిత్యం ఊహించదగ్గ స్థాయిలో లేదన్న బాధతోనో తమ అనుభవాలనైనా కొందరు రాస్తారని, వాటిని ముద్రిస్తారని భావిస్తున్నాను.

'గోర్ బోలి' మాతృభాషగా ఉన్న మీకు తెలుగు భాషపై ఆసక్తి/ అనురక్తి ఎలా కలిగింది?

నర్సరీ అప్పుడే నన్ను శ్రీనికేతన్ అనే స్కూల్లో జాయిన్ చేశారు మా వాళ్ళు. మొదట ఎవరితో మాట్లాడేవాడిని కాను. మా తండా పిల్లలు గోర్ బోలి మాట్లాడకుండా తెలుగునే మాట్లాడేవాళ్ళు. మా నానమ్మ కూడా తనకు వచ్చీ రాని తెలుగు మాట్లాడేది. ఆవిధంగా గోర్ బోలి భాష ఉపయోగం నా విషయంలో చాలా తక్కువ. మొదట తెలుగు మాట్లాడడానికి కూడా ఇబ్బంది పడ్డాను. తర్వాత మొత్తం తెలుగునే మాట్లాడాల్సి వచ్చింది. భాషకి సంబంధించి ఒక లాంటి సంఘర్షణ జరిగేది. అటు తెలుగు సరిగ్గా మాట్లాడడం రాక, ఇటు మా గోర్ బోలి మాట్లాడితే, పదాలు ఓవర్లాప్ అయ్యి, భాష నత్తి పోయేది. ఇలా తెలుగుకు అలవాటు పడినా, నా తప్పులను ఎవరు పాయింట్ అవుట్ చేసినా, ఏవి కూడా నెత్తికి ఎక్కేవి కావు. మొదటి పుస్తకం వేసే దాకా తప్పులు లేకుండా రాసే వాడిని కాదు. ఇప్పుడు మెరుగయిందనే అనుకుంటున్నాను.

చిన్నతనంలోనే కవితలు రాయడంపై ఎవరి ప్రభావం మీపై ఉంది?

బహుశా నా బాల్యం, నా చుట్టూ ఏర్పడిన నిర్బంధం కావొచ్చు. బోధన్‌లో హైస్కూలు చదువుకునే సమయానికే బొమ్మలు వేస్తూ ఉన్నాను. ఆ బొమ్మలకి సంపూర్ణత్వం చేకూరాలంటే ఏదైనా రాస్తే బాగుంటుందని రెండు లైన్ల క్యాప్షన్స్ రాసేవాడిని. తర్వాత తర్వాత మా లాంగ్వేజ్ టీచర్స్, వాళ్ళ పాఠ్య బోధనా, తెలంగాణ ఉద్యమం ఇవన్నీ కొన్ని ప్రభావం చూపిన కారణాలుగా చెప్పొచ్చు.

'ఢావ్లో' అన్న పదానికి అర్థం? ఆ కథాసంపుటి రాయడానికి గల నేపథ్యం ఏమిటి?

మా వాళ్లలో, ముఖ్యంగా స్త్రీలు ఢావ్లోను కచ్చితంగా నేర్చుకుంటారు. ఢావ్లో అంటే విషాదగీతమని అర్థం. దీనిని విషాద సమయాల్లోనే కాదు. ఆనంద సమయాల్లోనూ, ఎదురుపడినప్పుడల్లా కౌగిలించుకొని పాడుకుంటూ ఏడుస్తుంటారు/ ఏడుస్తూ పాడుకుంటారు. మా పూర్వీకులు పాడుకున్న పాటలే, లిఖితపూర్వకంగా లేకున్నా, మౌఖికంగా కొత్త తరాన్ని కూడా చేరుతున్నాయి. మౌఖికంగా ఉన్న ఈ సంప్రదాయం ఇంకా చెక్కుచెదరకుండా ఉన్నా, కాస్తా ఆధునికంగా మారిందని చెప్పొచ్చు. కథలకు ఈ శీర్షిక పెట్టడానికి కారణం ఏంటంటే, చుట్టూ ఉన్న సాహితి మిత్రులందరూ వాళ్ల బాల్యంలో వాళ్ళు చూసిన, విన్న ఈ ఢావ్లోను గురించి అడిగారు. ఎలాగో మొదటి పుస్తకం బల్దేర్ బండితో రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడో ఒక అక్కడ ప్రయాణాన్ని కొనసాగించాను. ఆ ప్రయాణం తర్వాత నా కథ చెప్పడం అవసరం కదా అనిపించింది. అందుకే ఢావ్లోను వినిపించాను.

తెలుగు, ఆంగ్లం, స్పానిష్... ఇలా భాషలు అధ్యయనం చేయడానికి కారణం?

ప్రతి భాషని అధ్యయనం చేద్దామని మొదలుపెట్టి ఏ భాషని సంపూర్ణంగా అధ్యయనం చేయలేక మధ్యలోనే ఆపేసాను. దానికి గల కారణాలు ఎన్నో ఉన్నప్పటికీ, కాస్తో కూస్తో వచ్చి రాని భాషలో నేను చదివిన, నా దష్టికి వచ్చిన వాటి గురించిన విషయాలు వేరే భాషల వారితో చర్చించే అవకాశం నాకు ఆంగ్ల భాష ద్వారా కలిగింది. తెలుగులో గొప్ప సాహిత్యం ఉన్నా, ఆంగ్లంలోకి అంత విస్తతంగా అనువాద దిశగా వెళ్లలేదు. వెళ్లట్లేదు. బహుశా భవిష్యత్తులో తెలుగు నుంచి ఇంగ్లీష్‌లోకి అనువాదాలు నేనే చేస్తానేమో. ఇప్పటికైతే మా తెగల సంబంధించిన రచనల్ని మాత్రమే అనువాదం చేయాలన్న ఎరుకతో ఉన్నాను. ప్రతి భాషకి ఒక సౌందర్యం ఉన్నట్టు, ప్రతి భాషలోనూ, మాండలికాల పరిధిలో ఉండే జీవితానికి సంబంధించిన విస్తతిలో, ఒక చొచ్చుబడిన చరిత్ర, సాంస్కృతిక నిర్బంధం, అసంపూర్ణ గతం దాగి ఉంటాయని, ఉన్నాయని నేను విశ్వసిస్తాను. మనం అనువాదాల ద్వారా ఇట్టి విషయాలు చదివినప్పుడు, లేదా మనకు అవగతమైనప్పుడు, ఇవన్నీ మనకి సంబంధించినవే అని అనుకున్నా కానీ, వాటిని స్వీకరించే ధైర్యం చేయము. వాటిని స్వీకరించినట్లయితే ఇక్కడ మన అస్తిత్వ అనువాదంలో (ఏ ప్రక్రియలో అయినా రాయడంలో) నిజాయితీని కోల్పోతాం. ఒక లాంటి ఎరుక, అర్థం చేసుకునే మానసిక స్థితి కావాలంటే ఒకటి రెండు భాషలు కూడా తెలిసి ఉండాలనేది నా అభిప్రాయం.

ఏ వృత్తిలో స్థిరపడాలనుకుంటున్నారు?

ప్రస్తుతానికి ఉద్వేగంతో చెప్తున్నాను, రచయితగా ఉండిపోవాలని, సమయం దొరికితే అప్పుడప్పుడు పిల్లలకి పాఠాలు చెప్పాలని అనుకుంటున్నాను.

మీ భవిష్యత్ కార్యక్రమాలు ఏమిటి?

రెండు తెలుగు రాష్ట్రాల్లో మనకు మొత్తం 35 గిరిజన, సంచార, ఆదివాసీ తెగలు ఉన్నాయి. నా అవగాహనా మేరకు, వాటిలో కొన్ని తెగలకు సంబంధించి సాహిత్య సృజన చేసినా చాలనుకుంటున్నాను. నాకు రాయడం అనేది కచ్చితం. కానీ ఎంత కాలం రాస్తాను, ఏం రాస్తాను అనేది చుట్టూ వాతావరణమే నిర్ణయిస్తుంది. ప్రస్తుతానికి ప్రొఫెసర్ సూర్యా ధనంజయ్, డా.ధనంజయ్ నాయక్, మంత్రి శ్రీనివాస్ గార్లతో కలిసి 'తిత్రి' అనే పుస్తకానికి సంపాదకత్వం వహిస్తున్నాను.

యువ కలాలకు/ గళాలకు మీ సూచనలు సలహాలు ఏమిటి?

ఇది కేవలం నా ఒపీనియన్ మాత్రమే. ప్రస్తుతానికి తెలుగు సాహిత్యంలో అస్తిత్వవాదం చాలా బలంగా వినిపిస్తుంది. ముఖ్యంగా యువకులందరూ కూడా వాళ్ళ వాళ్ళ కథలను బలంగా చెబుతున్నారు. రాస్తున్న వాళ్ళందరూ కూడా ఎంఏలు, బిఏలు చేసి ఉండకపోవచ్చు. కాబట్టి వాళ్ళు రాస్తున్న రచనల్లో కొత్త కొత్త పోకడలు కనిపిస్తూ ఉంటాయి. అవి కొన్నిసార్లు ఒకలాంటి సాహిత్యానికి అలవాటు పడిన వాళ్లకు కొరుకుడు పడకపోవచ్చు. కాబట్టి దాన్ని సాహిత్యంగా స్వీకరించడానికి కూడా మనసు పోకపోవచ్చు. రాయాలి అనుకున్న దాన్ని నిజాయితీగా రాయండి. మన వాయిస్ చాలా అవసరం. మనం చెప్పాలనుకున్నది చెప్పకపోతే, గతంగానే మిగిలిపోతాం. అందరికీ నాకు లాగా అవార్డులు రాకపోవచ్చు. అవార్డు వచ్చింది కదా అని అవార్డు వచ్చిన వాళ్ళు రాసిందే గొప్ప రచనలనే భ్రమ అక్కర్లేదు. ఖచ్చితంగా ఎక్కడో ఒక దగ్గర మనకంటూ చెప్పుకోవడానికి చేతివేళ్ల మీద లెక్కపెట్టే అంతమంది పాఠకులు అయినా ఉంటారు.

సంభాషణ
డాక్టర్ టేకుమళ్ల వెంకటప్పయ్య

శేషేంద్ర సింహనాదం 'మండే సూర్యుడు'

సందర్భం

"కాలపు కఠిన శిలల్లోంచి
కాంతి జ్వాల త్రవ్వి తీస్తా !
ఎదిరించే శతాబ్దాల నిదురకు నిప్పంటిస్తా!"


ఇది సూర్యుని ఆవాహనం చేసుకున్న గుంటూరు శేషేంద్ర శర్మ సింహనాదం. ఆయన రచించిన మినీ కవితా సంకలనం 'మండే సూర్యుడు'లోని తొలి కవితలోనే ఈ ప్రతిజ్ఞ చేశారు. 1974లో వెలువడిన ఈ కావ్యానికి 2024 స్వర్ణోత్సవ సంవత్సరం.

ప్రాచీనాంధ్ర సారస్వతానికి పట్టుకొమ్మ అయిన పద్యంపై సమున్నత సాధికారత సాధించిన శేషేంద్ర 'ఋతుఘోష' వంటి సర్వకాలీనమైన పద్య కావ్యాలు వెలువరించారు. ఆ తరువాత జరిగిన సమకాలీన సారస్వత పరిణామాలనూ ఆయన ఆహ్వానించారు. 'ఫ్రీవర్స్ ఫ్రంట్' పేరుతో వచన కవితా ఉద్యమానికి ఆద్యుడైన కుందుర్తి వచన కవితలోనూ మహాకావ్యాల ఆవిర్భావం జరగాలని ఆశించారు. అందుకు శేషేంద్ర సమ్మతించడమే విశేషం. పర్యవసానంగా శిష్ట సంశ్లిష్ట సంస్కృత పదభూయిష్ట సుదీర్ఘ సమాస చాలనంలో సిద్ధహస్తులైన శేషేంద్ర సరళతరమైన వచన కవిత వైపు దృష్టి సారించి మినీ కవితకు ఆద్యులయ్యారు. ఆ దశలో వెలువడిన వచన కవితల సమాహారమే 'మండే సూర్యుడు.' ఆ తదనంతరం శేషేంద్ర రూపొందించిన, పవన్ కళ్యాణ్ పునర్ముద్రించిన 'ఆధునిక మహాభారతం' బృహత్కావ్యంలో మండే సూర్యుడు 'సూర్య పర్వం'గా చోటుచేసుకుంది.

శేషేంద్ర గారి ప్రతిజ్ఞను ప్రేరణగా తీసుకొని అర్ధ శతాబ్ది నాటి ఈ కవితలను మరోమారు పరిశీలిస్తే మిరుమిట్లు గొలిపే కాంతి జ్వాలలెన్నో గోచరిస్తాయి. శిలలు కాలానికి ప్రత్యక్ష సాక్షులు. శిలల రూపురేఖలను పరిశీలించి, వాటి గర్భంలో నిదురించే మూలకాలను పరిశోధించి కాలాన్ని అంచనా వేస్తారు. ఆ విధంగా కఠిన శిలలను నాటి సామాజిక స్థితిగతులకు ప్రతీకలుగా దర్శించిన శేషేంద్ర ఆశించే విప్లవమే తాను త్రవ్వి తీయాలనుకున్న కాంతి జ్వాల.

పాతకాలం పద్యమైతే.. వర్తమానం వచన కవిత్వం అన్నది ఆనాటి ధోరణి. వచన కవితలో అంత్యప్రాసలు, చమత్కారం, అధిక్షేపణం, ప్రముఖ పాత్ర వహిస్తాయి. వేమన ఆటవెలదిలోని సూటితనం, గజల్ నిర్మాణ చాతుర్యం, అనుష్టుప్ ఛందస్సులను ఔపోసన పట్టిన పండిత కవి శేషేంద్ర హృదయంలో రూపుదిద్దుకున్న మినీ వచన కవితలు మండే సూర్యునిలానే తళుక్కుమంటాయి.

నేను చెమట బిందువును
కండల కొండల్లో ఉదయించే
లోక బంధువును .. అంటూ ప్రారంభమయ్యే ఈ కావ్యంలో శేషేంద్ర కాలానికి, సూర్యునికి, ఆత్మగౌరవానికి ,శ్రమ శక్తికి ఎన్నో ఉపమానాలను ఎన్నో ప్రతీకలను సృష్టించారు. "నా శరీరం/ ఒక శాశ్వత హోమం/ అది సూర్యుడి స్వగృహం" అంటూ తనే స్వయంగా మండే సూర్యునిలో అంతర్భాగమయ్యారు. "కవిత్వం ఒక మెస్మరిజం/ కవి కన్ను ఒక ప్రిజం / నేను సృష్టించిన అలంకారం / నీ అంధకారానికి దీపం" అన్న శేషేంద్ర మనో నేత్రానికి మాత్రమే సాక్షాత్కరించే మనోహర దృశ్యాలెన్నో అక్షర వర్ణచిత్రాలై ఈ కావ్యంలో చోటు చేసుకున్నాయి.





"అస్తమించే నక్షత్ర లోకాన్ని / ఆవలిస్తూ చూసింది కాలం", " నాగలి భుజాన వేసుకుని/ వస్తున్నాడు సూర్యుడు/ కొండ శిఖరాలెక్కి ..", "అడవిలో అగ్నిజ్వాలలు/ కాషాయ వస్త్రాలను ధరించిన/ సన్యాసుల గుంపులా/ పరిగెత్తుతున్నాయిప్పుడు" ... నిస్సత్తువను నిరసించే శేషేంద్ర శ్రమ శక్తికి సాష్టాంగ పడతారు.ఆ శ్రమ శక్తికి సృజనాత్మకతను జోడించడమే శేషేంద్ర వీక్షణం.

"మట్టితో జీవ శిల్పం మలచే వాడి ముందు
శూన్యంతో రేఖలు వంచే వాడి ముందు
రూపాలు మోకారిస్తాయి!"
"చెట్టు సూర్యుని గర్భంలో ధరిస్తుంది
చెట్టు గర్భం అంతర్లోక ఆకాశం"
"వర్షం వేయి చేతులతో
నా తలుపు కొడుతుంది"

శేషేంద్ర కంటిలో ప్రిజం ఉన్నందు వల్లనే ఆయన కవిత్వంలో మనకు ఈ మెస్మరిజం కనిపిస్తుంది. "పూర్ణమదః పూర్ణమిదం" అంటూ ఉపనిషత్తులు వివరించే మార్మిక పరిభాషను "సున్నలో బంధించబడ్డ ఆకాశం" అంటూ ఆయన మాత్రమే అంత సరళ సుందరంగా భావ వ్యక్తీకరణ చేస్తారు.

శేషేంద్ర మహోన్నత స్వాప్నికులు.

"రాత్రి నేను నా దిండు కలసి కలలు కంటాం
పగలు నేను నా కలం వాటిని పంచుకుంటాం"

అంటున్న శేషేంద్ర తన కలల గురించి చెబుతూ - "కాగితాల పడవల్లో/ కలలు ప్రయాణం చేస్తున్నాయి" అంటున్నారు పసి హృదయంతో. అలా అని అవి ఏవో చంటి పిల్లల కలలు అనుకుంటే పొరపాటు. ఇంతకూ ఏమిటా కలలు అంటే.. "వంగిపోతున్న దేశానికి/ నింగి ఎత్తు వెన్నెముక నిర్మించే పండుగలో పాల్గొంటున్నాయి" అంటున్నారు.

తూర్పు దిశలో ఉదయిస్తున్న ప్రభాత సూర్యబింబాన్ని చూసి స్పందించని కవులుండరు. తమను తాము మరిచిపోతూ ఏదో అసంకల్పిత పారవశ్యానికి లోనై ఆ దృశ్యాన్ని వర్ణించడం పరిపాటి. శేషేంద్ర కూడా 'ఋతుఘోష'లో సూర్యుని వర్ణిస్తూ 'దుర్నిరీక్ష్య ప్రభాధూర్ధరచ్ఛటలతో...' పటు రోషకాషాయ కుటిలాంశు కశలతో..'ఖర మయూఖ క్రూర ఘనకాండ పటలితో..' గ్రీష్మకాల ప్రాంశు కింశుక ద్యుతులతో.. 'గగన ఘన ఘోట ఖుర నిరాఘాట ధాటి..' అంటూ ధాటిగా మార్తాండుని ప్రచండ రథాన్ని వర్ణించారు. అదే శేషేంద్ర ఈ మండే సూర్యుడులో...

"సూర్యుడు ప్రాచీ రేఖ మీద ఉన్నాడు
అలమారు మీద ఆపిల్ పండులా"

అన్నారు. అరుణోదయ సూర్యబింబాన్ని ఇంత సరళ సుందరంగా సహజ స్వభావోక్తిలో వర్ణించడం మళ్లీ శేషేంద్రకే సాధ్యమైంది. ఈ విధంగా శేషేంద్ర ప్రారంభించిన మినీ కవితా మహోద్యమం తెలుగు నాట ఉత్తుంగ తరంగాలుగా విస్తరించింది. మళ్లీ 1985లో శేషేంద్ర ఆంధ్ర జ్యోతిలో శేషేంద్రజాలం శీర్షికన 'అరుస్తున్న ఆద్మీ' పేరుతో మళ్లీ లఘు కవితలు రాశారు. ఆధునిక మహాభారతంలో 'ఆద్మీ పర్వం' పేరుతో ఇవి చోటు చేసుకున్నాయి. ఇందులో మళ్లీ తొలి కవిత సూర్యుని పైనే కావడం విశేషం.

"సూర్యుడి నుంచి సూర్యుడికి
ఇరవై నాలుగు గంటల దూరం
మనిషి నుంచి మనిషికి
రెండు గుండెల దూరం"

తెలుగునాట బహుళ ప్రచారంలో ఉన్న ఈ శేషేంద్ర మినీ కవిత ఇందులోదే. శేషేంద్ర హృదయం ప్రళయ విస్ఫోటనాలకే కాదు, ప్రశాంతతకూ కేంద్రమే!

"పావురంలా రాత్రి నా గుండె మీద వాలింది
బాధల తుఫానును ఒక నవ్వుతో తుడిచి వేశాను"

అంటూ మండే సూర్యునిలో శేషేంద్ర చూపించిన ఈ పరిష్కార మార్గం ఈనాటి ప్రపంచ మానవాళికి శిరోధార్యం!

- డా. వెనిగళ్ల రాంబాబు
కవి, సినీ గీత రచయిత, అధ్యాపకులు

కేసుల విచారణలో మరింత జాప్యం

- కొత్త క్రిమినల్ చట్టాలపై న్యాయ నిపుణుల ఆందోళన
- పాత వాటికే కొత్త పేర్లు, చిక్కులు చేర్చారని విమర్శ

న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా ఇప్పటికే అపరిష్కృత కేసులు గుట్టలుగుట్టలుగా ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చామని చెబుతున్న భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (బిఎన్ఎస్ఎస్), భారతీయ న్యాయ సంహిత (బిఎన్ఎస్), భారతీయ సాక్ష్య అధినియం (బిఎస్ఎ)తో కేసుల విచారణ మరింత జాప్యం జరుగుతుందని ప్రముఖ న్యాయవాది ఇందిరా జైసింగ్ వంటి న్యాయ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బిఎన్ఎస్ఎస్, బిఎన్ఎస్, బిఎస్ఎ ప్రభుత్వం చెబుతున్నట్లుగా కొత్తగా రూపొందించిన చట్టాలేమీ కాదు. వలస పాలకుల కాలం నాటి పాత చట్టాలలోని దాదాపు తొంభై ఐదు శాతం నిబంధనలనే కొత్త చట్టాలలో ఉంచారు. ఒక్క మాటలో చెప్పాలంటే కొత్త చట్టాలు పాత చట్టాలకు ప్రతిరూపాలేనని నిపుణులు తేల్చేశారు. కాకపోతే కొన్ని కొత్త చిక్కు ముడులు చేర్చి..పేర్లు మాత్రం మార్చారు. హిందూత్వ అజెండాలో భాగంగానే చట్టాల పేర్లను హిందీ-సంస్కృత భాషల్లోకి మార్చారు. దీనివల్ల న్యాయ వ్యవస్థకు కొత్త చిక్కులు తెచ్చిపెట్టినట్లు అయ్యింది.

వాటిపై పాత చట్టాల ప్రకారమే విచారణ

నూతన చట్టాలు ఈ నెల 1వ తేదీన అమలులోకి వచ్చాయి. నేషనల్ జ్యుడీషియల్ గ్రిడ్ అంచనాల ప్రకారం ఆ రోజుకు దేశంలోని వివిధ న్యాయస్థానాల్లో 3.6 కోట్ల క్రిమినల్ కేసులు పెండింగులో ఉన్నాయి. వీటిలో 3.4 కోట్ల కేసులు జిల్లా, తాలూకా కోర్టులలో అపరిష్కృతంగా ఉన్నవే. హైకోర్టులలో 17 లక్షలు, సుప్రీంకోర్టులో 18,122 కేసులు పెండింగులో ఉన్నాయి. ఈ కేసులన్నీ పాత చట్టాల ప్రకారం నమోదైనవేనని, 10 నుండి 12 సంవత్సరాలుగా విచారణలో ఉన్నాయని, కాబట్టి పాత చట్టాల ప్రకారమే వీటిపై విచారణ జరిపి తీర్పులు ఇవ్వాల్సి ఉంటుందని సుప్రీంకోర్టులో ప్రముఖ న్యాయవాది అయిన ఇందిరా జైసింగ్ తెలిపారు. అయితే కథ అక్కడితోనే


ఇందిరా జైసింగ్
ప్రముఖ న్యాయవాది


నిపున్ సక్సేనా
సుప్రీంకోర్టు న్యాయవాది


అసిఫ్ అలీ
కేరళ మాజీ డిజిపి

ముగిసిపోలేదు. 'పాత చట్టాల ప్రకారం విచారణ జరిపినప్పుడు సమస్య మరింత పెరుగుతుంది. ఎందుకంటే వీటిపై పునరాలోచన జరపాలని డిమాండ్ ముందుకు రావచ్చు. ఈ నెల 1వ తేదీకి ముందు విచారణలో ఉన్న ప్రతి కేసులోనూ పాత చట్టాలే తమకు మేలు చేస్తాయని నిందితులు భావిస్తే వారు వాటి ప్రకారమే తమ కేసులను విచారించాలని కోరతారు. అయితే అదే సమయంలో పోలీసులు నూతన చట్టాల ప్రకారం విచారణ జరపాలని కోరవచ్చు. ఈ చిక్కుముడిని ఎవరు విప్పాలి? అందుకు ఎంతకాలం పడుతుందో?' అని ఇందిరా ప్రశ్నించారు.

అన్నీ చిక్కుముడులే

నూతన చట్టాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసిన నిపున్ సక్సేనా కూడా ఇందిరా జైసింగ్ అభిప్రాయంతో ఏకీభవించారు. ఆయన మరికొన్ని సమస్యలను కూడా ముందుకు తెచ్చారు. 'కొత్త చట్టంతో విచారణ జరిపితే అది మరింత జాప్యానికి కారణమవుతుంది. ఎందుకంటే అవి స్వభావపరంగా అస్పష్టంగా ఉన్నాయి. ఈ నెల 1వ తేదీతో నిందితుడి పోలీస్ రిమాండ్ పూర్తయిందనుకుందాం. అప్పుడు పోలీసులు ఏమంటారు? బిఎన్ఎస్ఎస్‌లోని సెక్షన్ 187 లేదా రిమాండ్ చట్టం ప్రకారం నిందితుడిని మరికొంత కాలం రిమాండులో ఉంచాలని వారు కోరతారు. నిందితుడు మాత్రం దీనికి అంగీకరించడు. జూలై 1వ తేదీకి ముందు విచారణలో ఉన్న కేసులను సిఆర్‌పిసి కిందనే పరిష్కరించాలని బిఎన్ఎస్ఎస్‌లోని సెక్షన్ 531 చెబుతోంది. అయితే ఇది కూడా పెద్దగా ఉపయోగపడదు. ఎందుకంటే రిమాండ్ గడువు ఆ తేదీకి ముగిసే కేసులకు మాత్రమే అది వర్తిస్తుంది. ఏదో ఒక నిర్ణయం తీసుకోవడానికి కాల పరిమితి పెండింగులో ఉంటే అప్పుడు ఏ చట్టాన్ని వర్తింపచేస్తారు? చట్టపరమైన మార్గదర్శకం లేనప్పుడు ఏ చట్టాన్ని వర్తింపచేయాలో న్యాయమూర్తే నిర్ణయించాల్సి ఉంటుంది' అని ఆయన చెప్పారు.

సిఆర్‌పిసి కొనసాగాల్సిందే

న్యాయ వ్యవస్థలో భాగంగా పాత చట్టాలను ఎలా కొనసాగిస్తారని నిపున్ సక్సేనా ప్రశ్నించారు. 'ట్రయల్ కోర్టుల్లో క్రిమినల్ కేసు విచారణకు సగటున ఐదు నుండి ఏడు సంవత్సరాల సమయం పడుతుంది. నిందితులు, సాక్షులు, స్వాధీనం చేసుకున్న పత్రాలు, వస్తువుల సంఖ్య ఎక్కువగా ఉంటే విచారణకు మరింత సమయం పడుతుంది. సిఆర్‌పిసి కింద నమోదైన కేసులో అప్పీళ్లు కానీ, రివిజన్ పిటిషన్ కానీ వస్తే దాని ప్రకారమే విచారణ కొనసాగించాలి తప్ప బిఎన్ఎస్ఎస్ కింద కాదని బిఎన్ఎస్ఎస్‌లోని సెక్షన్ 531 చెబుతోంది. అంటే దిగువ కోర్టు నుండి అత్యున్నత న్యాయస్థానం వరకూ వచ్చే అప్పీళ్లు, రివిజన్లపై సిఆర్‌పిసి కిందే విచారణ జరుగుతుంది. ఈ విచారణలు పూర్తి కావాలంటే మరో 20 సంవత్సరాలు పడుతుంది. కాబట్టి మ్యాజిక్ మంత్రదండంతో సిఆర్‌పిసిని చెరిపివేయలేము. అది చివరి కేసు పరిష్కారమయ్యేంత వరకూ...అంటే మరో 20-30 సంవత్సరాలు మనుగడలోనే ఉంటుంది' అని ఆయన వివరించారు.

పోలీసులకూ తలనొప్పే

కొత్త చట్టాలు పోలీసులకు సైతం తలనొప్పులు తెచ్చిపెడతాయి. వాటిలోని నిబంధనలను పాటించేందుకు ప్రభుత్వాలు సంసిద్ధంగా లేవని కేరళ మాజీ డిజిపి అసిఫ్ అలీ చెప్పారు. 'రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన చట్టం ప్రకారం...అని అనేక నిబంధనల్లో రాశారు. ఇది మరింత గందరగోళానికి దారితీస్తుంది. ఎందుకంటే ప్రత్యేక పరిస్థితులకు సంబంధించిన కేసుల విచారణకు రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి చట్టాలను రూపొందించలేదు. ఓ క్రమాన్ని కూడా నిర్దేశించలేదు' అని ఆయన వివరించారు. కొత్త చట్టాలు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ గురించి చెబుతున్నాయని, అయితే అనేక పోలీస్ స్టేషన్లలో దాని అమలుకు అవసరమైన మౌలిక సదుపాయాలు లేవని గుర్తు చేశారు. 'జీరో ఎఫ్ఐఆర్‌లు అమలులోకి వస్తే అన్నీ ఆన్‌లైన్ ద్వారానే జరుగుతాయి. అయితే ఈ దేశంలో ఎన్ని పోలీస్ స్టేషన్లకు ఆ సౌకర్యం ఉంది? అలాంటి సౌకర్యాలను ఎలా ఉపయోగించుకోవాలో ప్రజలకు తెలుసా?' అని ప్రశ్నించారు. ఏదైనా కేసులో స్వాధీనం చేసుకున్న పత్రాలను డిజిటలీకరించడం గ్రామాలు, పట్టణాలలో పనిచేస్తున్న పోలీసులకు తెలియదు. వారికి ఆ సాంకేతిక పరిజ్ఞానం ఉండదు.

సంప్రదింపులేవీ?

నూతన క్రిమినల్ చట్టాలను రూపొందించడానికి ముందు వాటిపై ప్రభుత్వం విస్తృత స్థాయిలో సంప్రదింపులు జరపలేదు. కనీసం పార్లమెంటులో అయినా సభ్యులందరి అభిప్రాయాలు తీసుకోలేదు. హడావిడిగా బిల్లును ఆమోదింపచేసుకున్నారు. చట్టాలు చేసేటప్పుడు వాటి కారణంగా భవిష్యత్తులో ఎదురయ్యే సమస్యలను ముందుగానే గుర్తించి, తగిన చర్యలు తీసుకుంటే ఇలాంటి ఇబ్బందులు తలెత్తవు.

'రువాండా బహిష్కరణ ప్రణాళిక రద్దు'

లండన్: వివాదాస్పద రువాండా బహిష్కరణ ప్రణాళికను రద్దు చేశారు. బ్రిటన్ నుండి రువాండాకు శరణార్థులను బహిష్కరించేందుకు మునుపటి ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ ప్రణాళిక చట్ట పరమైన సవాళ్లను రేకెత్తించేలా ఉండటంతో కొత్త ప్రధాని స్టార్మర్ దీనిని పక్కన పెట్టారు. ప్రధానిగా స్టార్మర్ తీసుకున్న మొదటి చర్య ఇది. ప్రధానిగా తాను నిర్వహించిన మొదటి విలేకరుల సమావేశంలో స్టార్మర్ మాట్లాడుతూ, కన్జర్వేటివ్ ప్రభుత్వ ప్రధాన పథకాన్ని కొనసాగించేందుకు సిద్ధంగా లేనని అన్నారు.

స్వీడన్‌లో తాతలకూ పేరెంటల్ లీవ్

స్టాక్‌హోమ్: పేరెంటల్ లీవ్‌లో ఉదారంగా ఉండే స్వీడన్ ఇప్పుడు మరింత ఉదారంగా వ్యవహరించింది. పసి పిల్లలను చూసుకునే తల్లి దండ్రులకు ప్రభుత్వం ఇచ్చే 16 మాసాలపాటు వేతనంతో కూడిన పేరెంటల్ లీవ్‌ను తల్లి దండ్రులిద్దరూ షేర్ చేసుకోవడానికి మాత్రమే ఇప్పటివరకు అనుమతించేవారు. ఈ నెల ఒకటి నుంచి ఈ పేరెంటల్ లీవ్‌లో తల్లిదండ్రులకు మాత్రమే కాకుండా మూడవ పార్టీకి కూడా కేటాయించుకోవచ్చని ప్రభుత్వం వీలు కల్పించింది. తల్లి 45 రోజులు, తండ్రి 45 రోజులు మొత్తం మీద 90 రోజుల దాకా పేరెంటల్ లీవ్‌ను తాతలకు, లేదా అత్త మామలకు, ఇంట్లో పిల్లల బాగోగులు చూసుకునే ఎవరికైనా ఆ తల్లి దండ్రులు కావాలనుకుంటే ఇచ్చుకోవచ్చు.

రథయాత్ర వేడుకలకు హాజరైన రాష్ట్రపతి ముర్ము

పూరీ : పూరీలో జగన్నాథ రథయాత్ర ఆదివారం ప్రారంభమయింది. వేరువేరు రథాల్లో కొలువుతీరిన జగన్నాథుడు, బలభద్రుడు, దేవి సుభద్రల ఉత్సవ విగ్రహాలను పూరీ శంకరాచార్య స్వామి నిశ్చలానంద సరస్వతి, ఆయన శిష్యబృందం దర్శన అనంతరం, పూరీ రాజు బంగారు చీపురుతో రథాలను శుభ్రం చేసిన తరువాత సాయంత్రం 5:20 గంటలకు ఈ యాత్ర ప్రారంభమయింది.

ఈ వేడుకలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఒడిషా గవర్నర్ రఘుబర్ దాస్, ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ, కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ హాజరయ్యారు. రథాల ముందు కళాకారుల బృందాలు పాటలు పాడుతూ, నృత్యాలు చేస్తూ ముందుకు సాగాయి. ఈ యాత్ర కోసం పూరీ పట్టణానికి దాదాపు 10 లక్షల మంది తరలివచ్చి ఉంటారని అంచనా. అలాగే, 53 ఏళ్ల తరువాత ఈ రథయాత్రను రెండు రోజుల పాటు నిర్వహించనున్నారు.

మహువా మొయిత్రాపై కేసు నమోదు

న్యూఢిల్లీ : తృణమూల్ కాంగ్రెస్ ఎంపి మహువా మొయిత్రాపై ఢిల్లీ పోలీసులు కేసు నమోదు చేశారు. జాతీయ మహిళా కమిషన్ (ఎన్‌సిడబ్ల్యు) చైర్‌పర్సన్ రేఖాశర్మపై అవమానకరమైన వ్యాఖ్యలు చేశారనే అభియోగాలతో ఎఫ్ఐఆర్ నమోదయింది. ఉత్తరప్రదేశ్‌లోని హత్రాస్‌లో తొక్కిసలాట ప్రాంతం సందర్శనకు వచ్చిన రేఖాశర్మపై మొయిత్రా అభ్యంతర వ్యాఖ్యలు పోస్టు చేశారని ఈ నెల 5న ఢిల్లీ పోలీసులకు ఎన్‌సిడబ్ల్యు ఫిర్యాదు చేసింది. ఆమెపై చర్యలు తీసుకోవాలని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు కూడా లేఖ పంపింది. 'మొయిత్రా వ్యాఖ్యలు అవమానకరమైనవి. పరువునష్టం కలిగించేవి' అని కమిషన్ ఒక ప్రకటనలో విమర్శించింది.

ఉత్తరాఖండ్‌లో భారీ వర్షాలు

- చార్‌ధామ్ యాత్ర వాయిదా

న్యూఢిల్లీ : ఉత్తరాఖండ్‌ను భారీ వర్షాలు అతలాకుతలం చేస్తున్నాయి. ప్రధాన నదులన్నీ ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తున్నాయి. పలు చోట్ల కొండచరియలు విరిగిపడ్డాయి. రాష్ట్రంలోని 9 జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు భారత వాతావరణశాఖ ఆదివారం రెడ్ అలర్ట్ జారీ చేసింది. భారీ వర్షాల నేపథ్యంలో చార్‌ధామ్ యాత్రను వాయిదా వేసినట్లు గర్వాల్ కమిషనర్ వినయ్ శంకర్ పాండే తెలిపారు. చమోలీ జిల్లాలోని బద్రీనాథ్ నేషనల్ హైవేపై పలు చోట్ల కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో వాహనాల రాకపోకలపై ఆంక్షలు విధిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

బీహార్‌లో పిడుగుపాటుకు ఒకే రోజు 10 మంది మృతి

పాట్నా : ఉరుములు మెరుపులతో కూడిన పిడుగుల వర్షం బిహార్ ప్రజల్ని భయకంపితుల్ని చేస్తోంది. గత రెండు వారాల్లో పిడుగులు పడి దాదాపు 40 మంది చనిపోయారు. తాజాగా మరో 10 మంది బలైపోయారు. ఆదివారం సాయంత్రం 5 గంటలకు గడిచిన 24 గంటల వ్యవధిలో వేర్వేరు చోట్ల పిడుగులు పడిన ఘటనల్లో 10 మంది చనిపోయినట్లు బీహార్ సిఎం నీతీశ్ కుమార్ కార్యాలయం వెల్లడించింది. నలంద జిల్లాలో ఇద్దరు మతిచెందగా.. వైశాలి, భాగల్పూర్, సహర్స, రోహ్తాస్, సరన్, జముయి, భోజ్‌పుర్, గోపాల్‌గంజ్‌లలో ఒక్కొక్కరు చొప్పున ప్రాణాలు విడిచినట్లు పేర్కొంది. పిడుగుపాటు మృతుల కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి రూ.4 లక్షల చొప్పున పరిహారం అందజేస్తామని ముఖ్యమంత్రి నితీష్ కుమార్ ప్రకటించారు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలను ఆయన కోరారు.

కేరళలో డిజిటల్ విద్య భేష్

- అది అన్ని దేశాలకూ ఆదర్శం
- ఎడ్‌టెక్ నమూనాపై యునిసెఫ్ ప్రశంసలు

తిరువనంతపురం : డిజిటల్ విద్యకు సంబంధించి కేరళ ప్రభుత్వం తీసుకున్న చర్యలను (ఎడ్‌టెక్) యునిసెఫ్ ప్రశంసించింది. ఇది భారత్‌లోని ఇతర రాష్ట్రాలకే కాకుండా వర్ధమాన, సంపన్న దేశాలకు ఆదర్శంగా నిలిచిందని యునిసెఫ్ ఇండియా అధ్యయనం తెలిపింది. ఇందుకు సంబంధించిన నివేదికను శనివారం ప్రచురించారు. యునిసెఫ్ ఇండియా విద్యా నిపుణురాలు ప్రమీలా మనోహరన్ నుండి కేరళ విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి రాణీ జార్జ్ అధ్యయన నివేదిక ప్రతిని అందుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి పినరయి విజయన్, సాధారణ విద్యా శాఖ మంత్రి వి.శివకుట్టి హాజరయ్యారు. విద్యకు సంబంధించిన మౌలిక సదుపాయాలు, సాంకేతిక పరిజ్ఞానం (కైట్) కార్యక్రమాన్ని కేరళ అమలు చేస్తోంది. రాష్ట్రంలోని 2,174 ఉన్నత పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ నేపథ్యంలో యునిసెఫ్ ఇండియా అధ్యయనం కైట్ కార్యక్రమంపై దృష్టి సారించింది. ఈ అధ్యయనం పది సిఫార్సులు చేసిందని అధికార ప్రకటనలో తెలియజేశారు. కేరళలో కైట్ ఆధ్వర్యంలోని ఎడ్‌టెక్ నమూనా కార్యక్రమం లాభాలు ఆశించే



'లిటిల్ కైట్స్' యూనిట్లకు అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో పినరయి విజయన్, యునిసెఫ్ ఇండియా ప్రతినిధి ప్రమీలా మనోహరన్

అమ్మకందారులపై ఆధారపడడం లేదు. దీనిని ఇతర ప్రాంతాలలో కూడా అమలు చేయవచ్చునని నివేదిక తెలిపింది. ఓపెన్-సోర్స్ సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి కేరళ రూ.3,000 కోట్లు ఆదా చేసిందని చెప్పింది. కైట్ కార్యక్రమాన్ని అమలు చేసేందుకు ఫిన్లండ్ సైతం ఆసక్తి చూపింది. కేరళను విజ్ఞాన, ఆర్థిక సమాజంగా మార్చేందుకు లిటిల్ కైట్ చర్యలు దోహదపడతాయని నివేదిక తెలిపింది. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీస్తుందని, సమస్యలను పరిష్కరించే నైపుణ్యాన్ని అందిస్తుందని వివరించింది. బాలికల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం ద్వారా స్టెమ్ క్షేత్రాల్లో లింగ అసమానతలను తొలగించడానికి కృషి చేస్తుందని చెప్పింది. అంతేకాక ఈ కార్యక్రమం కారణంగా ప్రైవేటు పాఠశాలలకు చెందిన అనేక మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరుతున్నారు. లిటిల్ కైట్ కార్యక్రమాన్ని అన్ని హైస్కూళ్లకు, ఉన్నత విద్యా స్థాయికి విస్తరించాలని యునిసెఫ్ అధ్యయనం సూచించింది. ప్రభుత్వ విద్యలో పెట్టుబడులు పెంచేందుకు స్థానిక సంస్థలు, సమూహాలను భాగస్వాములను చేయాలని కోరింది. లిటిల్ కైట్ కార్యక్రమం కోసం తొమ్మిది వేల రోబోటిక్ కిట్స్‌ను, శిక్షణను అందిస్తున్నందుకు కేరళను అభినందించింది. కైట్ కార్యక్రమం తన విజయ గాథలను ఇతర రాష్ట్రాలు, దేశాలతో పంచుకునేందుకు సిద్ధంగా ఉన్నదని యునిసెఫ్ ఇండియాలో పనిచేస్తున్న సామాజిక విధాన నిపుణుడు డాక్టర్ అఖిల రాధాకృష్ణన్ చెప్పారు. లిటిల్ కైట్ కార్యక్రమాన్ని ఇతర ప్రాంతాలకు విస్తరింపజేసేందుకు యునిసెఫ్ భాగస్వామ్యాన్ని కోరుతున్నామని కైట్ సిఇఒ కె అన్వర్ సాదాత్ తెలిపారు. అధ్యయన నివేదికను యునిసెఫ్ వెబ్‌సైటులో ప్రచురించారు.

కొల్‌కతా కమిషనర్, డిసిపిపై వేటు

న్యూఢిల్లీ : పశ్చిమ బెంగాల్‌లో గవర్నర్ రాజ్ కొనసాగుతోంది. గవర్నరు కార్యాలయ ఆదేశాలను పాటించలేదనే అభియోగాలతో కొల్‌కతా పోలీసు కమిషనర్ వినీత్ గోయల్, డిసిపి ఇందిరా ముఖర్జీలపై కేంద్ర హోంమంత్రిత్వ శాఖ క్రమ శిక్షణా చర్యలకు దిగింది. గవర్నర్ కార్యాలయంపై అవాస్తవాలను ప్రచారం చేయడమే అందుకు కారణమని కేంద్ర హోంమంత్రిత్వశాఖకు చెందిన అధికారులు పేర్కొన్నట్లు కథనాలు వెలువడ్డాయి. సిపి, డిసిపిలు ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ప్రవర్తించారని.. అందుకు గల కారణాలను వివరిస్తూ గవర్నర్ సివి ఆనంద్ బోస్ కేంద్ర మంత్రిత్వ శాఖకు నివేదికను సమర్పించారు. లోక్‌సభ ఎన్నికల అనంతరం జరిగిన హింస బాధితులతో కలిసి అసెంబ్లీలో ప్రతిపక్ష (బిజెపి) నేత సువేందు అధికారి తనను కలిసేందుకు వచ్చినప్పుడు పోలీసు సిబ్బంది వారిని అనుమతించలేదు. రాజ్‌భవన్‌లో పోలీసు సిబ్బంది ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని గవర్నర్ ఆదేశాలను లెక్క చేయడం లేదని పేర్కొన్నారు. వారి ప్రవర్తన ఆల్ ఇండియా సర్వీసెస్ నియమాలు, ప్రోటోకాల్ మాన్యువల్‌కు అనుగుణంగా లేవని గవర్నర్ నివేదికలో పేర్కొన్నారు. ఈ నివేదికను పరిశీలించిన కేంద్ర హోంశాఖ.. ఆ ఇద్దరు అధికారులపై క్రమశిక్షణ చర్యలకు సిద్ధమైంది. ఇందుకు సంబంధించిన పత్రాలను ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వానికి పంపించినట్లు సమాచారం. అయితే, ఇప్పటివరకు తమకు ఎలాంటి సమాచారం అందలేదని వినీత్ గోయల్, ఇందిరా ముఖర్జీలు పేర్కొనడం గమనార్హం.

పార్లమెంట్‌లో రైల్వే లోకో పైలెట్ల సమస్యలు : రాహుల్

న్యూఢిల్లీ : లోకో పైలెట్ల దుస్థితిపై ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ఆదివారం ఆవేదన వ్యక్తం చేశారు. లోకో పైలెట్ల హక్కులను, పని పరిస్థితులను మెరుగుపరిచేందుకు పార్లమెంట్‌లో ఇండియా ఫోరం తన గళాన్ని ఎలుగెత్తుతుందని చెప్పారు. 'ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వ హయంలో లోకో పైలెట్ల జీవితపు రైలు పూర్తిగా పట్టాలు తప్పింది' అని రాహుల్ గాంధీ ఎక్స్‌లో పోస్టు చేశారు. న్యూఢిల్లీ రైల్వే స్టేషన్‌లో ఇటీవల తాను లోకో పైలెట్లలతో మాట్లాడిన వీడియోను రాహుల్ పోస్టు చేశారు. రోజుకు 16 గంటలు వేడిగా ఉండే క్యాబిన్లల్లో లోకో పైలెట్లు పని చేయవల్సి వస్తోందని అన్నారు. 'కోట్లాది మంది ప్రయాణీకులు ఆధారపడే ఉద్యోగులకు తమ జీవితాలపైనే నమ్మకం లేదు. లోకో పైలెట్లకు పని గంటలపై పరిమితి లేదు. వారికి సెలవులు కూడా లేవు. మూత్ర విసర్జన వంటి కనీస సౌకర్యాలు కూడా లేవు' అని అన్నారు.

నీట్ సిలబస్ తగ్గటమే పెద్ద కారణం

- కచ్చితమైన నీట్ స్కోర్‌లపై ఎన్‌టిఎ వెల్లడి

న్యూఢిల్లీ : సిలబస్‌లో గణనీయమైన తగ్గింపు కారణంగా అండర్ గ్రాడ్యుయేట్ నేషనల్ ఎలిజిబిలిటీ-కమ్-ఎంట్రన్స్ టెస్ట్(నీట్-యూజీ) 2024లో 61 మంది విద్యార్థులు కచ్చితమైన 720/720 స్కోర్‌లను సాధించారని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) సుప్రీంకోర్టుకు వివరించింది. "61 మంది అభ్యర్థులు కచ్చితమైన స్కోర్ చేయటంలో అత్యంత ప్రముఖమైన అంశం.. సిలబస్‌లో తగ్గింపు. ఇది అభ్యర్థులు కోర్ కాన్సెప్ట్‌లపై దృష్టి పెట్టటానికి, మహమ్మారి కారణంగా చదువును పూర్తి చేయటంలో సవాళ్లను ఎదుర్కొన్న విద్యార్థులపై ఒత్తిడిని తగ్గించడానికి దోహదపడింది" అని ఎన్‌టిఎ వివరించింది. 2023లో హాజరైన అభ్యర్థుల సంఖ్య 20,38,596 కాగా, 2024లో హాజరైన అభ్యర్థుల సంఖ్య 23,33,297కి పెరిగిందని వివరించింది.

గాజాలో ఆకలి విపత్తు

- ఆహారం దొరక్క 5లక్షల మంది విలవిల
- 10వ నెలకు చేరిన ఇజ్రాయిల్ దాడి

గాజాసిటీ: అమెరికా, ఇతర పశ్చిమ దేశాల మద్దతుతో గాజాలో ఇజ్రాయిల్ దాడులకు ఆదివారంతో తొమ్మిది నెలలు పూర్తయ్యాయి. ఈ దాడి ఫలితంగా గాజాలో 5 లక్షల మంది ప్రజలు ఆకలి విపత్తును ఎదుర్కొంటున్నారని ఐరాస ఏజెన్సీలు చెబుతున్నాయి.భీకర వైమానిక దాడులు ఇప్పుడు పదవ నెలలోకి ప్రవేశించాయి. ఇప్పటివరకు 38,098 మంది చనిపోయారు. మరో 87, 705 మంది గాయపడ్డారు. వీరిలో ఎక్కువ మంది మహిళలు, పిల్లలు. ఈ దాడి గాజాలో 90 శాతం మంది పాలస్తీనీయులను శరణార్థులుగా మార్చింది. ఇళ్లు, ఇతర మౌలిక సదుపాయాలను నాశనం చేసింది. పాలస్తీనా భూ భాగం అంతటా పోరాటం ఉధృతంగా ఉండడంతో హింసను ఆపడానికి తాజా ప్రయత్నాలు జరుగ ుతున్నాయి. ఇటీవల దోహాలో ఖతార్ మధ్యవర్తిత్వంలో ప్రారంభమైన సంధి చర్చల్లో తన ప్రతినిధి బృందం పాల్గొంటుందని ఇజ్రాయిల్ తెలిపింది. నెతన్యాహు ప్రతినిధి మాట్లాడుతూ, కాల్పుల విరమణ, బందీల విడుదల ఒప్పందం ఎలా ఉండాలనేదానిపై కొన్ని అస్పష్టతలున్నాయని అన్నారు. వచ్చే వారం ఇజ్రాయిల్ ప్రతినిధి బృందం దోహాకు వెళ్లనున్నట్లు ఆ ప్రతినిధి తెలిపారు.

సూరత్ ప్రమాదంలో ఏడుకు చేరిన మృతుల సంఖ్య

గాంధీనగర్ : గుజరాత్‌లోని సూరత్‌లో శనివారం బిల్డింగ్ కూలిన ఘటనలో మృతుల సంఖ్య ఏడుకు చేరింది. మరి కొంత మంది శిథిలాల కిందే చిక్కుకున్నారు. 2017లో ఈ బిల్డింగ్‌ని అక్రమంగా నిర్మించినట్టు అధికారులు తేల్చారు. ఆదివారం సహాయక చర్యలు కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు. ఏడుగురి మృతదేహాల్ని అధికారులు వెలికి తీశారు. శనివారం మధ్యాహ్నం 3 గంటలకు ఈ ఘటన జరిగిందని అధికారులు చెప్పారు. అప్పటికే కూలిపోయే దశలో ఉన్న భవనం...వర్షాల కారణంగా మరింత కుంగిపోయిందని స్థానికులు, అధికారులు వెల్లడించారు. ఈ అపార్ట్‌మెంట్‌లో మొత్తం 30 ఫ్లాట్‌లున్నాయి. వీటిలో చాలా వరకూ ఖాళీగానే ఉన్నాయి. పైగా ఈ బిల్డింగ్‌ని అక్రమంగా నిర్మించారని తేలింది. 2017లో ఈ అపార్ట్‌మెంట్‌ని కట్టారు. స్థలాన్ని ఆక్రమించి నిర్మాణం చేపట్టినట్టు అధికారులు గుర్తించారు. ఈ ఘటనలో 15 మంది తీవ్రంగా గాయపడ్డారు. ప్రస్తుతం వాళ్లకు చికిత్స అందిస్తున్నారని చెప్పారు. అయితే..ఈ బిల్డింగ్ కూలిన సమయంలో చాలా మంది వరకూ బయట పనులకు వెళ్లారు. ఫలితంగా ప్రాణనష్టం తప్పింది. లేదంటే ఎక్కువ మంది చనిపోయి ఉండే వారని అధికారులు ఆందోళన వ్యక్తం చేశారు. నైట్‌షిఫ్ట్ చేసి వచ్చి కొందరు నిద్రిస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. బిల్డింగ్ కూలిన వెంటనే స్థానికులు ఉలిక్కిపడ్డారు.

వెలుగులోకి భోలే బాబా అక్రమాలు

ఆల్వార్ : ఉత్తరప్రదేశ్‌లోని హథ్రాస్‌లో తొక్కిసలాట ఘటనకు కారణమైన నారాయణ్ సర్కార్ హరి అలియాస్ భోలే బాబా అక్రమాలు ఒక్కటికొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. హథ్రాస్‌లో నిర్వహించిన ప్రార్థనా సమావేశంలో తొక్కిసలాట జరిగి 122 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఈ వార్తతో రాజస్థాన్‌లోని అల్వార్ జిల్లా సహజ్‌పురా గ్రామం ఒక్కసారిగా ఉలిక్కి పడింది. ఎందుకంటే భోలే బాబాకు ఈ ప్రాంతంతో సంబంధం ఉంది. బాబా సూరజ్‌పాల్ జాతవ్ పేరుతో ఆయన ఇక్కడ కొంతకాలం గడిపారు. కోవిడ్ సమయంలో భోలే బాగా ఇక్కడి ఆశ్రమంలో పది నెలల పాటు ఆశ్రయం పొందారు. ఆ సమయంలో తరచుగా సత్సంగ్‌లు నిర్వహించారు. దూర ప్రాంతాల నుండి వేలాది మంది భక్తులు ఈ కార్యక్రమానికి హాజరయ్యే వారు. ఆశ్రమం కోసం గ్రామానికి చెందిన దేవీరామ్ తన భూమిని విక్రయించారు. అయితే తనకు చెందిన అదనపు భూమిని భోలే బాబా బలవంతంగా ఆక్రమించారని, అందులో ఆయన అనుచరులకు గదిని నిర్మించారని దేవీరామ్ ఆరోపించారు. 2008-09లో సుమారు ఒకటిన్నర బిఘాల (బిఘా అంటే 0.619 ఎకరాలు లేదా 24.78 గుంటలు) భూమిని బాబా కమిటీకి అమ్మానని, 2010లో అక్కడ ఆశ్రమ నిర్మాణం మొదలైందని ఆయన చెప్పారు. అప్పటి నుండి ఆశ్రమంలో సత్సంగ్‌లు నిత్యకృత్యమయ్యాయి. వివిధ ప్రాంతాల నుండి భక్తులు పెద్ద సంఖ్యలో రావడం మొదలు పెట్టారు. అయితే స్థానికులను ఆశ్రమంలోకి అనుమతించ లేదని సహజ్‌పురా గ్రామస్థులు ఆరోపించారు. మహిళలు, బాలికలకు మాత్రం ఎలాంటి అడ్డంకులు ఉండేవి కావని తెలిపారు.



మీకోసం

లవంగాల టీ తరచూ తీసుకుంటుంటే జలుబు బారిన పడకుండా ఉంటారు.

జీవన సౌరభం

పుస్తకం గొప్పతనం అందులో ఉండే విషయం మీద ఆధారపడదు. అది మనకు అందించే ఆలోచన మీద ఆధారపడి ఉంటుంది.

ఎదగాలి



క్రమశిక్షణతో మెలగాలి
తప్పక బడికి రావాలి
పాఠాలు శ్రద్ధగా చదవాలి
పాటలు చక్కగా పాడాలి

గురువులను పూజించాలి
తరువులను పోషించాలి
నీరును పొదుపు చేయాలి
నోరును అదుపు చేయాలి


కోపం, ద్వేషం విడనాడాలి
ప్రేమను అందరికీ పంచాలి
సమత, మమత పెంచాలి
అందరు సఖ్యతగుండాలి

మన భాషను ప్రేమించాలి
పరభాషను గౌరవించాలి
బాలల్లారా, ఆచరించాలి
ఉన్నతులుగా ఎదగాలి

- కయ్యూరు బాలసుబ్రమణ్యం, 77802 77240.

లెక్క చేయండి

పిల్లలూ, ఇచ్చిన క్లూ ఆధారంగా కింద ఇచ్చిన లెక్కలు చేయండి.



నేను గీసిన బొమ్మ





వి.గుణ వర్ధన్, 9వ తరగతి, అరవింద హైస్కూల్, కుంచనపల్లి, గుంటూరు.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

జల ప్రవాహాలు.. జర భద్రం!

వర్షాకాల ప్రారంభ సమయంలో పొంగి పొర్లే నదీనదాలను, సెలయేళ్లు, జలపాతాలను దగ్గరుండి మరీ ఆస్వాదించాలని కొందరు కుటుంబ సమేతంగా సుదూరాలు ప్రయాణాలు చేస్తుంటారు. ముఖ్యంగా ఉత్తర భారత యాత్రలకు ఈ కాలంలో ఎక్కువగా వెళతారు. ఒక్కోసారి సందర్శకులను ప్రమాదాలు చుట్టుముట్టడం విషాదానికి దారి తీస్తుంది. కొండ చరియలు విరిగిపడి, నదీనదాలు పొంగిపొర్లడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇలాంటి ప్రమాదాల నివారణకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడంతో పాటు ఎవరికి వారు తగు జాగ్రత్త వహించడం చాలా అవసరం.



ఉత్తరాఖండ్, కేదరనాథ్, అమర్‌నాథ్ వంటి యాత్రా స్థలాల్లో, అసోం, అరుణాచల్ ప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్ వంటి అనేక సందర్శక ప్రదేశాల్లో ఎప్పుడూ ప్రమాదాలు పొంచి వుంటాయి. ఆయా ప్రాంతాల్లో ఉన్న హిమానీ నదాలు ఎప్పుడు ద్రవీభవనం చెందుతాయో చెప్పలేం. అలాగే కొండ ప్రాంతాల్లో కురిసే వర్షాలకు ఆకస్మిక వరదలు పోటెత్తుతాయి. క్షణాల వ్యవధిలో వరద నీరు సెలయేళ్ల వేగాన్ని పెంచుతుంది. అప్పటివరకు ఆహ్లాదంగా ఉన్న ఆ ప్రాంతమంతా ప్రమాదభరితంగా మారిపోతుంది.

జలపాతాల వద్ద ...

చాలామంది ఈ సమయంలో జలపాతాల సందర్శనకు వెళ్తుంటారు. అలా వెళ్లే వారు ఆ జలపాతాల తీరుతెన్నులను తెలుసుకుని వెళ్లాలి. గతంలో అక్కడ సంభవించిన ప్రమాదాలపై ఆరా తీయాలి. ఒకవేళ ఎప్పుడూ అక్కడ ప్రమాదం సంభవించకపోయినా, తగు జాగ్రత్తల్లో ఉండాలి. లైఫ్ జాకెట్స్, ఇతర రక్షణ పరికరాలు ఎప్పుడూ వెంటే ఉంచుకోవాలి. ఆయా ప్రాంతాల్లో ఉన్న హెచ్చరిక సందేశాలను తప్పకుండా పాటించాలి. ఆ ప్రాంత నైసర్గిక స్వరూపం గురించి స్థానిక అధికారులతో చర్చించి వెళితే ఇంకా మంచిది.

బయలుదేరినప్పుడు ప్రశాంతంగా ఉన్న వాతావరణం తీరా అక్కడికి వెళ్లాక ఒక్కసారిగా మారిపోవచ్చు. ఆ సమయంలో నిపుణుల నుంచి వచ్చే సూచనలను జాగ్రత్తగా పరిశీలించాలి. ఎప్పటికప్పుడు చుట్టూ ఉన్న పరిసరాల్లో వస్తున్న మార్పులను గమనిస్తూ ఉండాలి. ఒకవేళ అప్పటికే సెలయేర్ల మధ్యలోకి వెళ్లిపోయి ఉంటే – వాతావరణంలో వచ్చిన మార్పును గమనించి ఒడ్డుకు చేరుకోవాలి.

ప్రవాహ ప్రదేశాల్లో విహారం చేయాలనుకునేవారు అక్కడ నుంచి ఒడ్డు ఎంత దూరంలో ఉందో ఎప్పుడూ గమనిస్తూ ఉండాలి. అలాగే ఎత్తైన బండలు, అంచుల నుంచి దూరంగా ఉండాలి. అనుకోని విధంగా వేగమైన ప్రవాహం వస్తే ఆ రాళ్లపై నుంచి జారిపోవచ్చు, లేదా ప్రవాహ వేగంలో కొట్టుకుపోవచ్చు. కాబట్టి ఎప్పుడూ కనీస దూరంలోనే ఉండేలా ప్రణాళికలు వేసుకోవాలి. తగిన రక్షణ పరికరాలు ఉపయోగించాలి.

పాదరక్షలు, వస్త్రధారణ ముఖ్యం

విహార యాత్రలకు వెళ్లినప్పుడు వస్త్రధారణ చాలా ముఖ్యం. అలాగే తగిన పాదరక్షలు ధరించడం కూడా అవసరం. జలపాతాల వద్ద ఎప్పుడూ తేమగా ఉంటుంది కాబట్టి, స్లిప్ కాని పాదరక్షలు ధరించాలి. ఓపెన్–టోడ్ బూట్లు, ఫ్లిప్–ఫ్లాప్‌లను ధరించడం మానేయాలి. అలాగే అసౌకర్యానికి గురికాకుండా తేలిగ్గా, త్వరగా ఆరిపోయే దుస్తులు ధరించాలి.

జలపాతం సందర్శనకు వెళ్లేటప్పుడు ఒకలాగా ఉన్న వాతావరణం తీరా అక్కడికి వెళ్లాక మారిపోతే, వెంటనే ఆ చోటును వదిలిపెట్టేయాలి. సురక్షిత ప్రదేశానికి చేరుకోవాలి.

ఇంకొన్ని జాగ్రత్తలు

సందర్శనా స్థలాలకు వెళ్లే మార్గాల రూట్ మ్యాప్ ఎప్పుడూ దగ్గర పెట్టుకోవాలి. ఒక్కోసారి కొండచరియలు విరిగిపడి ఆ మార్గాలు మూసుకుపోతుంటాయి. అప్పుడు ముందుకు వెళ్లలేని పరిస్థితి, వెనక్కి రాలేని పరిస్థితి వస్తుంది. గంటలు గంటలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ట్రాఫిక్‌లో ఇరుక్కుపోతారు. కాబట్టి, వెళ్లే మార్గం గురించి పూర్తి అవగాహన కల్పించుకోవాలి.

కొంతమంది చేయి చేయి పట్టుకుని జారుడు బండలు దాటుతూ ఉంటారు. ఇలా చేయడం ప్రమాదాన్ని కొనితెచ్చుకోవడమే. బృందంలో ఏ ఒక్కరో సరిగ్గా అడుగు తీసి అడుగు వేయలేకపోతే మిగిలిన వారంతా భయపడిపోతారు. ఆ ఒక్కరినీ హెచ్చరించే క్రమంలో ప్రమాదంలో పడిపోతారు. కాబట్టి ఇద్దరు, ముగ్గురికి మించి ఒకేసారి వెళ్లకూడదు.

పిల్లలతో జాగ్రత్త!

జలపాతాల దగ్గరకు వెళ్లినప్పుడు పిల్లలను ఆపడం చాలా కష్టం. నీళ్లల్లో ఈదేందుకు, సెల్ఫీలు దిగేందుకు వారు చూపించే ఉత్సాహం, ప్రమాదాన్ని అంచనా వేయడంలో ఉండదు. స్వతహాగా పిల్లల్లో ఉన్న ఆసక్తి వారికి భయాన్ని దూరం చేస్తుంది. జలపాతం చూసిన ఆనందంలో దాన్ని చేరుకోవాలని పరుగులు పెడుతుంటారు. పెద్దలు ఎప్పుడూ వారిని పర్యవేక్షిస్తూ ఉండాలి. కొండచరియలు, అంచుల వద్దకు వెళ్లకుండా నిలుపుదల చేయాలి. ప్రయాణానికి ముందే జల ప్రవాహ వేగాల గురించి, ప్రమాదాల గురించి అవగాహన కల్పించాలి. అప్పుడే సెల్ఫీల పేరుతో ప్రమాదాల అంచున నిలబడి ప్రాణాల మీదకు తెచ్చుకోకుండా ఉంటారు.



సీక్వెల్స్ నుంచి ప్రీక్వెల్స్ కొత్త ట్రెండ్



మంచి కథలున్న సినిమాలను ప్రేక్షకులు ఎప్పుడూ ఆదరిస్తుంటారు. కథనంలో కొత్తదనం, అధునాతన పరిజ్ఞానం, కొత్త విషయాలను తెలిసేలా చేసే ప్రయత్నాలతో వచ్చే సినిమాలను అభినందిస్తుంటారు. ఆదరణ పొందిన కథను అనేక పార్టులుగా తీయటం ఇప్పుడు ట్రెండుగా మారింది.చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా పాత కథకే కొత్తరూపాన్ని జోడిస్తే పాత, కొత్త ప్రపంచాల్లోకి తీసుకెళ్లేందుకు చేసే ప్రయత్నాలే ప్రీక్వెల్స్, సీక్వెల్స్. గతంలో ఉన్న కథకు ముందురూపమే ప్రీక్వెల్. దానికి కొనసాగింపుగా ఒకటి, రెండు, మూడు అంటూ ఇలా తీసే చిత్రాలే సీక్వెల్స్. ఒక సినిమా ఎక్కడ మొదలైందో అంతకుముందు జరిగిన కథను ప్రీక్వెల్స్‌గా తెరకెక్కించేందుకు కూడా కొందరు దర్శకులు ప్రయత్నిస్తున్నారు. తెలుగులో బాహుబలి ప్రపంచ రికార్డులను నెలకొల్పిన వేళ బాహుబలి–2 వచ్చింది. ఆ తర్వాత నుంచి సీక్వెల్స్, ప్రీక్వెల్స్ మార్క్ మూవీలు తెరకెక్కుతున్నాయి. పెద్ద హీరోల సినిమాలు దాదాపుగా సీక్వెల్స్‌లోనే నడుస్తున్నాయి. తాజాగా ప్రీక్వెల్స్ ముందుకొస్తుండటం మరొక ట్రెండుగా ఉంది.

బింబిసార 2తో సరికొత్తగా తెరపైకి

కథానాయకుడు నందమూరి కళ్యాణ్‌రామ్ పుట్టినరోజైన శుక్రవారం నాడు ఆయన 22వ చిత్రాన్ని అధికారికంగా ప్రకటించారు. విజయవంతమైన 'బింబిసార' చిత్రానికి ప్రీక్వెల్‌గా ఆ చిత్రం రూపొందుతుందని చెప్పారు. 'బింబిసార' కంటే ముందు జరిగిన కథను బింబిసార 2గా చూపించనున్నారు. అనిల్ పాదూరి దర్శకత్వం వహిస్తున్నారు. ఎన్టీఆర్ ఆర్ట్స్ పతాకంపై కొసరాజు హరికృష్ణ నిర్మిస్తున్నారు. ఈ సినిమా పోస్టర్‌ను విడుదల చేస్తూ 'బింబిసార' కన్నా యుగాల ముందు త్రిగర్తల రాజ్యాన్ని ఏలిన చక్రవర్తిని చూడటానికి సిద్ధంగా ఉండండి' అంటూ పేర్కొన్నారు. విజువల్ ఎఫెక్ట్స్‌లో నిపుణుడైన అనిల్ పాదూరి 'బింబిసార'కు పనిచేశారు. తెరపైన ఇప్పటివరకూ చూడని దృశ్య సౌందర్యంతో త్రిగర్తల రాజ్యాన్ని ఆవిష్కరించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, 'బింబిసార 2' పేరుతో రూపొందనున్న ఈ సినిమా పూర్వ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని సినీ పరిశీలకుల సమాచారం.

విజయాలు .. పరాజయాలు

ప్రస్తుతం ఇండస్ట్రీలో సీక్వెల్స్ జోరు కొనసాగుతూనే ఉంది. అయితే కొన్ని సినిమాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటుండగా మరికొన్ని బాక్సాఫీసు వద్ద బోల్తా కొడుతున్నాయి. మెగాస్టార్ చిరంజీవి నటించిన 'శంకర్‌దాదా ఎంబిబిఎస్' మొదటిపార్టు ఆకట్టుకున్నా సెకండ్ పార్టు 'శంకర్‌దాదా జిందాబాద్' బాక్సాఫీసు వద్ద నిరాశపర్చింది. హీరో పవన్‌కళ్యాణ్ నటించిన 'గబ్బర్‌సింగ్' సినిమా ఆయన కెరీర్‌లోనే అతిపెద్ద హిట్‌మూవీగా నిలిచింది.సీక్వెల్ మూవీ సర్దార్ గబ్బర్‌సింగ్ 'అనుకున్నస్థాయిలో మెప్పించలేకపోయింది. అల్లు అర్జున్ నటించిన 'ఆర్య' కూడా బన్నీ కెరీర్‌లో బిగ్గెస్ట్ హిట్ మూవీగా నిలిచింది. ఆర్య 2 యావరేజ్ మూవీగా నిలిచింది. హీరోయిన్ ఛార్మి నటించి హార్రర్ జోనర్‌లో వచ్చిన 'మంత్ర' మూవీ తొలిభాగం ప్రేక్షకులను అలరించింది. సీక్వెల్ 'మంత్ర 2' అంతగా



ఆదరణకు నోచుకోలేదు. రామ్‌గోపాల్ వర్మను బాలీవుడ్ స్టార్ డైరెక్టర్‌గా నిలిపిన 'సత్య'కు సీక్వెల్‌గా వచ్చిన 'సత్య 2' చిత్రం మెప్పించలేకపోయింది. 'కిక్' చిత్రంతో అదిరిపోయే సక్సెస్‌ను అందుకున్న రవితేజ మరోసారి ప్రయత్నించి 'కిక్2' కోసం ప్రయత్నించి అంత సక్సెస్ పొందలేకపోయారు. 'మనీమనీ' చిత్రానికి మంచి ఆదరణే వచ్చింది. సీక్వెల్‌గా వచ్చిన 'మోర్ మనీమనీ' ఫ్లాప్‌గా నిలిచింది. తెలుగులో 'రఘువరన్ బిటెక్' చిత్రం ఘనవిజయాన్ని సాధించింది. 'విఐపి2'గా వచ్చిన సీక్వెల్ అంతగా ప్రేక్షకులను ఆకర్షించలేకపోయింది. నాగార్జున 'మన్మథుడు' ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. 'మన్మథుడు2' నిరాశే మిగిల్చింది.

ధైర్యం చేస్తున్న పెద్ద దర్శకులు

టాలీవుడ్‌తోపాటుగా దక్షిణాది చిత్ర సీమలో ఈ సీక్వెల్స్ ఓ ఒరవడిగానే కొనసాగుతున్నాయి. తాజాగా 'అఖండ', 'కాంతారా', 'ఖైదీ', 'గాడ్‌ఫాదర్' వంటి సినిమాలు నిర్మాణంలో ఉన్నాయి. నందమూరి బాలకృష్ణ, బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో వచ్చిన 'అఖండ'లో 'పాపకు ఆపద వస్తే వస్తానని ప్రమాణం చేస్తాడు హీరో. అదే స్క్రిప్ట్‌ను సీక్వెల్‌గా డెవలప్ చేస్తానని బోయపాటి శ్రీను ఇటీవల ప్రకటించారు.

మలయాళంలో మోహన్‌లాల్ హీరోగా సూపర్ హిట్ మూవీ 'లూసీఫర్'. దీనిని తెలుగులో చిరంజీవి హీరోగా 'గాడ్‌ఫాదర్'గా రీమేక్ చేశారు. తాజాగా ఈ సినిమా ప్రీక్వెల్ తెరకెక్కించబోతున్నట్లుగా దర్శకుడు మోహన్‌రాజా వెల్లడించారు. మలయాళంలో కూడా 'లూసీఫర్ 2' సిద్ధమైంది.

రిషబ్‌శెట్టి హీరోగా నటించి దర్శకత్వం వహించిన చిత్రం 'కాంతారా'. 'కాంతారా2' త్వరలో తెరకెక్కుతోంది. ఫస్ట్ పార్టులో హీరో తండ్రి అడవిలో మాయమైపోతాడు. ఇక ఆ ఊరి భూమిని కాపాడటానికి హీరో తండ్రికి పంజుర్లి దైవం ఎలా సహకరించిందనేది రెండో భాగంలో చూపించబోతున్నారు. తమిళ హీరో విజయ్ 'లియో' సినిమాకు ప్రీక్వెల్‌గా 'ఖైదీ' సినిమా రాబోతోంది. శంకర్ దర్శకత్వంలో కమల్‌హాసన్ హీరోగా వచ్చిన 'భారతీయుడు' సినిమాకు 'భారతీయుడు 2'గా రానుంది. సేనాదిపతి పాత్రకు సంబంధించిన స్టోరీతో మొదలు కానుంది. ప్రభాస్ నటించిన 'సలార్' కూడా రెండోపార్టు రానుంది. బెల్లంకొండ శ్రీనివాస్ 'రాక్షసుడు2', వెంకటేష్ 'ఎఫ్4', 'డిజె టిల్లు'కు 'టిల్లు స్క్వేర్, ఇస్మార్ట్‌శంకర్‌కు డబుల్ ఇస్మార్ట్ రెండోపార్టులు ఉన్నాయి. అల్లు అర్జున్ నటించిన బ్లాక్ బ్లస్టర్ మూవీ 'పుష్ప'కు సీక్వెల్‌గా 'పుష్ప2' రానుంది. 'ఢీ', 'క్రాక్', 'జాతిరత్నాలు', 'జాంబిరెడ్డి', 'హనుమాన్'తదితర చిత్రాలు పార్టులుగానే రానున్నాయి.

అభిషేక్ అదరహో



46 బంతుల్లోనే సెంచరీ చేసిన చిచ్చర పిడుగు
శివమెత్తిన రుతురాజ్, రింకూ సింగ్
స్పిన్, పేస్‌కు జింబాబ్వే విలవిల
వంద పరుగుల తేడాతో భారత్ ఘన విజయం

హరారే : కుర్రాళ్లు ప్రతీకార పంజా విసిరారు. తొలి టీ20లో అనూహ్యంగా తడబాటుకు గురైన శుభ్‌మన్ గిల్ సేన.. మరుసటి రోజే పసికూనపై ప్రతాపం చూపించింది. బ్యాట్‌తో, బంతితో తిరుగులేని ప్రదర్శన చేసిన భారత్ 100 పరుగుల తేడాతో జింబాబ్వేను చిత్తు చేసింది. ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను 1–1తో సమం చేసింది. అభిషేక్ శర్మ (100, 47 బంతుల్లో 7 ఫోర్లు, 8 సిక్స్‌లు) సెంచరీతో చెలరేగాడు. రుతురాజ్ గైక్వాడ్ (77 నాటౌట్, 47 బంతుల్లో 11 ఫోర్లు, 1 సిక్స్), రింకూ సింగ్ (48 నాటౌట్, 22 బంతుల్లో 2 ఫోర్లు, 5 సిక్స్‌లు) మెరుపు ఇన్నింగ్స్‌లతో కదం తొక్కారు. టాప్–4 బ్యాటర్లు రాణించటంతో భారత్ తొలుత నిర్ణీత 20 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 234 పరుగుల భారీ స్కోరు సాధించింది. రికార్డు ఛేదనలో జింబాబ్వే తేలిపోయింది. భారత పేసర్లు అవేశ్ ఖాన్ (3/11), ముకేశ్ కుమార్ (3/37) సహా స్పిన్నర్ రవి బిష్ణోయ్ (2/11) మాయజాలంతో జింబాబ్వే విలవిల్లాడింది. 18.4 ఓవర్లలో 134 పరుగులకే ఆలౌటైంది. వెస్లీ (43, 39 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్), ల్యూక్ జొంగ్వే (33, 26 బంతుల్లో 4 ఫోర్లు), బ్రియాన్ బెనెట్ (26, 9 బంతుల్లో 1 ఫోర్, 3 సిక్స్‌లు) రాణించారు. శతక వీరుడు అభిషేక్ శర్మ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు అందుకున్నాడు. భారత్, జింబాబ్వే మూడో టీ20 బుధవారం హరారే వేదికగా జరుగనుంది.

అభి.. ఆకాశమే హద్దు! : అరంగేట్ర మ్యాచ్‌లో డకౌట్‌గా నిష్క్రమించిన అభిషేక్ శర్మ (100) రెండో టీ20లో తనేంటో చూపించాడు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (2) నిరాశపరిచినా.. ఓ ఎండ్‌లో పవర్‌ప్లేలో ఓపిగ్గా నిలబడ్డాడు. ఇన్నింగ్స్ ఆరంభంలోనే ఓ సిక్సర్, రెండు ఫోర్లు బాదిన అభిషేక్.. పవర్‌ప్లేలో నెమ్మదించాడు. గిల్ వికెట్ అందుకు తోడైంది. దీంతో తొలి ఆరు ఓవర్లలో భారత్ 36 పరుగులే చేసింది. వ్యక్తిగత స్కోరు 28 వద్ద అభిషేక్‌కు జీవనదానం లభించింది. ఈ అవకాశం సద్వినియోగం చేసుకున్న అభిషేక్ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. అప్పటి వరకు 24 బంతుల్లో 28 పరుగులే చేసిన అభిషేక్.. ఆ తర్వాతి 22 బంతుల్లో ఏకంగా 72 పరుగులు పిండుకున్నాడు. నాలుగు ఫోర్లు, మూడు సిక్సర్లతో 33 బంతుల్లో అర్థ సెంచరీ సాధించిన అభిషేక్.. వంద మార్క్‌ను ఏడు ఫోర్లు, ఎనిమిది సిక్సర్లతో 46 బంతుల్లోనే అందుకున్నాడు.

భారత చిచ్చరపిడుగు ఆకాశమే హద్దుగా చెలరేగాడు. ఐపిఎల్‌లో ప్రపంచ శ్రేణి పేసర్లను చితక్కొట్టిన చిన్నోడు.. హరారేలో జింబాబ్వే బౌలర్లను హడలెత్తించాడు. 46 బంతుల్లోనే శతకబాదిన అభిషేక్ వర్మ (100) హ్యాట్రిక్ సిక్సర్లతో సెంచరీ సాధించిన తొలి ఆటగాడిగా రికార్డు నెలకొల్పాడు. రుతురాజ్ గైక్వాడ్ (77), రింకూ సింగ్ (48) సైతం మెరవటంతో తొలుత భారత్ 234 పరుగుల భారీ స్కోరు చేసింది. బౌలర్లు సమిష్టిగా చెలరేగటంతో ఛేదనలో జింబాబ్వే 134 పరుగులకే చేతులెత్తేసింది. 100 పరుగుల తేడాతో భారత్ ఏకపక్ష విజయం సాధించింది. ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను 1-1తో సమం చేసింది.

పేస్, స్పిన్ మాయ : టీ20ల్లో జింబాబ్వేపై అత్యధిక పరుగులు చేసిన జట్టుగా నిలిచిన టీమ్ ఇండియా.. బంతితోనూ ఆ జట్టు అదే స్థాయిలో వణికించింది. పేసర్లు ముకేశ్ కుమార్, అవేశ్ ఖాన్‌లు ఆరు వికెట్లు పడగొట్టగా.. స్పిన్నర్ రవి బిష్ణోయ్ రెండు వికెట్లతో మాయ చేశాడు. దీంతో 18.4 ఓవర్లలోనే జింబాబ్వే కుప్పకూలింది. 134 పరుగులకే పరిమితమైన ఆతిథ్య జట్టు.. 100 పరుగుల భారీ తేడాతో పరాజయం పాలైంది.

స్కోరు వివరాలు :

భారత్ ఇన్నింగ్స్ : శుభ్‌మన్ గిల్ (సి) బెనెట్ (బి) ముజరబాని 2, అభిషేక్ శర్మ (సి) మేయర్స్ (బి) మసకద్జ 100, రుతురాజ్ గైక్వాడ్ నాటౌట్ 77, రింకూ సింగ్ నాటౌట్ 48, ఎక్స్‌ట్రాలు :7, మొత్తం : (20 ఓవర్లలో 2 వికెట్లకు) 234.

వికెట్ల పతనం : 1–10, 2–147.


బౌలింగ్ : బ్రియాన్ బెనెట్ 2–0–22–1, బ్లెసింగ్ ముజరబాని 4–1–30–1, తండాయ్ చతార 4–0–38–0, సికిందర్ రజా 3–0–34–0, ల్యూక్ జొంగ్వే 4–0–53–0, మేయర్స్ 1–0–28–0, మసకద్జ 2–0–29–1.

జింబాబ్వే ఇన్నింగ్స్ : ఇన్నోసెంట్ (బి) ముకేశ్ కుమార్ 4, వెస్లీ (బి) రవి బిష్ణోయ్ 43, బ్రియాన్ బెనెట్ (బి) ముకేశ్ కుమార్ 26, మేయర్స్ (సి) రింకూ సింగ్ (బి) అవేశ్ ఖాన్ 0, సికిందర్ రజా (సి) జురెల్ (బి) అవేశ్ ఖాన్ 4, కాంప్‌బెల్ (సి) రవి బిష్ణోయ్ (బి) వాషింగ్టన్ 10, క్లైవ్ (ఎల్బీ) రవి బిష్ణోయ్ 0, మసకద్జ రనౌట్ 1, ల్యూక్ జొంగ్వే (సి) గైక్వాడ్ (బి) ముకేశ్ కుమార్ 33, బ్లెస్సింగ్ (సి) వాషింగ్టన్ (బి) అవేశ్ ఖాన్ 2, చతార నాటౌట్ 0, ఎక్స్‌ట్రాలు : 11, మొత్తం : (18.4 ఓవర్లలో ఆలౌట్) 134.

వికెట్ల పతనం : 1–4, 2–40, 3–41, 4–46, 5–72, 6–73, 7–76, 8–117, 9–123, 10–134.

బౌలింగ్ : ముకేశ్ కుమార్ 3.4–0–37–3, అభిషేక్ శర్మ 3–0–36–0, అవేశ్ ఖాన్ 3–0–15–3, రవి బిష్ణోయ్ 4–0–11–2, వాషింగ్టన్ సుందర్ 4–0–28–1, రియాన్ పరాగ్ 1–0–5–0.

ఎపిఎల్‌లో రాయలసీమ కింగ్స్ గెలుపు



ప్రజాశక్తి - పిఎం.పాలెం (విశాఖపట్నం)

విశాఖలోని ఎసిఎ విడిసిఎ క్రికెట్ స్టేడియంలో ఆదివారం జరిగిన ఆంధ్రా ప్రీమియర్ లీగ్ (ఎపిఎల్) మ్యాచ్‌లో ఉత్తరాంధ్ర లయన్స్‌పై రాయలసీమ కింగ్స్ ఆరు వికెట్ల తేడాతో విజయం సాధించింది. తొలుత టాస్ గెలిచిన ఉత్తరాంధ్ర లయన్స్ బ్యాటింగ్ ఎంచుకొని నిర్ణీత 20 ఓవర్లలో 121 పరుగులు చేసి ఆలౌట్ అయింది. రాయలసీమ కింగ్స్ బౌలర్లు పదునైన బౌలింగ్‌తో ఉత్తరాంధ్ర లయన్స్ బ్యాట్స్‌మ్యాన్లకు చెమటలు పట్టించారు. గిరినాథ్ రెడ్డి, షేక్ మహ్మద్ రఫీ, బి.వినయ్‌లు రెండేసి వికెట్ల చొప్పున తీసి పరుగులకు బ్రేకులు వేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన రాయలసీమ కింగ్స్ 17.3 ఓవర్లలో నాలుగు వికెట్లు మాత్రమే కోల్పోయి విజయ లక్ష్యాన్ని చేరుకుంది. ఓపెనర్ హనీష్ రెడ్డి మొదట్లోనే అవుటైనా ఆ జట్టును డిబి.ప్రశాంత్ కుమార్ ఆదుకున్నారు. 36 బంతుల్లో 51 పరుగులు చేసి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచారు. మిడిల్ ఆర్డర్‌లో దిగిన గుట్ట రోహిత్ 19 బంతుల్లో 26 పరుగులు చేసి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68